

అమరావతికి నూతన టీచర్లు

- జిల్లా నుంచి 45 బస్సుల ఏర్పాటు
- రేపు ఉదయం 6 గంటలకు ప్రయాణం

(వివరాలు 6లో..)



వరాలిచ్చే స్వామివారి సేవకు భక్తులు పోటీ పడి ముందుకు వస్తున్నారు. దేవస్థానం అభివృద్ధి పనులకు కోట్ల రూపాయలను సమకూరుస్తున్నారు. అధికారులు అడగడమే తరువాయి.. 'ఎంత ఖర్చవుతుందో అంచనా వేయండి. పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసుకోండి. డబ్బులు మేమిస్తాం..' అని అంటున్నారు. ఫలితంగా.. దశాబ్దాలుగా ఆలోచనలు, ప్రతిపాదనలకు పరిమితమైన పనులు కార్యరూపం దాలుస్తున్నాయి. భక్తుల ఉత్సాహం.. అధికారుల చొరవతో కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయం సర్వాంగ సుందరంగా మారేందుకు సిద్ధమౌతోంది.

ఆనతినియ్యరా.. స్వామీ..!




కలశం నమూనా

కసాపురం దేవస్థానం

పూర్తిగా రాతితో.. గర్భాలయం

ఆలయ గర్భగుడి రాతి మండపం స్కెచ్



- ఆలయ గోపురాలకు స్వర్ణ కలశాలు
- ఈశాన్యంలో కోనేటి నిర్మాణం
- 55 గదులతో వసతి సముదాయం
- యాగశాల, గోశాల, ప్రసాదాల తయారీ షెడ్డు నిర్మాణం
- కుంభాభిషేకానికి ఉత్తరాయణంలో ముహూర్తం
- కసాపురం నెట్టికంటి ఆలయ అభివృద్ధికి భక్తుల ఉత్సాహం
- ఖర్చు అంచనాలను సిద్ధం చేస్తున్న ఆలయ అధికారులు

గుంతకల్లు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధికి అడుగులుపడ్డాయి. మాస్టర్ ప్లాన్ తయారు కాలేదన్న కారణంగా పుష్కర కాలం కిందట ఆగిన పనులలో కదలిక వచ్చింది. ఆలయంలో ముఖ్యమైన నిర్మాణ కార్యక్రమాలకు అధికారులు స్కెచ్‌లను తయారుచేశారు. కలశాల ఏర్పాటుకు దాతలను సిద్ధం చేసుకున్నారు. వాటి తయారీ అంచనా వ్యయంతో ప్రతిపాదనలను తయారు చేశారు. అసంపూర్తిగా నిలిచిన (మిగతా 6లో...)



బంగారు కలశాలు

కసాపురం ఆలయ గోపురాలకు బంగారు కలశాలను ఏర్పాటు చేయాలనేది దశాబ్దాల కల. గోపురాల నిర్మాణం మూడు దశాబ్దాల క్రితం జరిగింది. కానీ కలశాలను ఏర్పాటు చేయలేదు. కలశాలకు అవసరమైన బంగారాన్ని ఇస్తామని భక్తులు ముందుకొచ్చినా, ముందుడుగు పడలేదు. నెల క్రితం ఈఓగా బాధ్యతలు స్వీకరించిన విజయరాజు, స్వర్ణ కలశాల ఏర్పాటుకు దాతను వెతికి పట్టుకున్నారు. ఆలయంలో 25 కలశాలను ఏర్పాటు చేయాల్సి ఉందని, ఎంత ఖర్చవుతుందో అంచనా వేస్తామనిఆయన తెలిపారు. ఆలయాల్లో ప్రతిష్ఠలు, శుభకార్యాలను ఉత్తరాయన కాలంలో చేపడతారు. వచ్చే ఫిబ్రవరి నాటికి కలశాలను ఏర్పాటు చేసి, ఆలయంలో తొలిసారిగా కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించడానికి కార్యాచరణ రూపొంది స్తామని ఈఓ తెలిపారు.

డీఎస్సీలో మరో మాయ..!

ఎంపిక జాబితాలో అర్హత అభ్యర్థి పేరు మాయం

- తరువాతి స్థానాల్లో ఉన్నవారికి చోటు
- అధికారుల ముందు బాధితుడి గోడు



ఆంజనేయులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాల ప్రక్రియలో మాయలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పదేపదే సర్టిఫికెట్ల పరిశీలన చేసినా.. ఎంపిక జాబితాలో అనర్హులకు చోటు కల్పించడం, అర్హుల పేర్లు లేక పోవడం వ్యవహారాలు బయట పడుతున్నాయి. బుద్ధిమాంద్యం (ఎంఐ) కేటగిరీలో ఓ అభ్యర్థి అనర్హుడు అని వైద్యుడు సర్టిఫికెట్ ఇచ్చారు. దానిని కూడా విద్యాశాఖాధికారులే తీసుకొచ్చారు. అయినా ఆ అభ్యర్థికి ఎంఐ కేటగిరీ కింద సోషల్ సబ్జెక్టులో ఎంపిక చేసి (మిగతా 6లో...)

అర్హులందరికీ పథకాలు

ఆధారాలతో వస్తే న్యాయం

జడ్పీ సమావేశంలో ఎంపీ అంబికా

ఆర్డీటీ అంశంపై చైర్ పర్సన్‌తో వాగ్వాదం

వైద్యం, యూరియా సమస్యలను లేవనెత్తిన సభ్యులు



ఆర్డీటీ అంశంపై ఎంపీ, జడ్పీ చైర్ పర్సన్ వాగ్వాదం

(7లో...)

టమోటా రైతును ఆదుకోవాలి

మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఏపీ రైతు సంఘం నేతల డిమాండ్



టమోటాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): టమోటా రైతును రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. మండలంలోని కక్కలపల్లి క్రాస్‌లో గల టమోటా మార్కెట్‌కు మంగళవారం వచ్చిన టమోటాలను ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, సహాయ కార్యదర్శి రాయుడు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పోతులయ్య, సంజీవరెడ్డి, వెంకటకొండ పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. నేతలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వ్యవసాయ పెట్టుబడులు, విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. రైతులు పండించిన పంటలకు మాత్రం గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. ఉమ్మడి జిల్లాలో 30 వేల ఎకరాల్లో టమోటా సాగైందనీ, ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.70వేలు పెట్టుబడి పెట్టారన్నారు. మార్కెట్‌లో ధర పడిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. పంట కోయడానికి అయ్యే కూలీల ఖర్చులు కూడా రాకపోవడంతో పొలాల్లోనే వదిలి పెడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణం టమోటా కిలో రూ.25 మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. నియోజకవర్గానికో కోల్డ్ స్టోరేజ్, జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



వైసీపీ నాయకుల దర్జా..!

సొంత అవసరాలకు పంచాయతీ బోరుబావి

నీరులేక మూతబడిన వాటర్‌ప్లాంటు

పట్టించుకోని అధికారులు



వైసీపీ నాయకులు వాడుకుంటున్న పంచాయతీ బోరుబావి, నీటి వసతి లేక మూతబడిన వాటర్‌ప్లాంటు

కనగానపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అధికారం పోయినా.. వైసీపీ నాయకుల ఆగడాలు మాత్రం ఆగట్లేదు. ప్రభుత్వ నిధులతో వేయించిన బోరుబావిని సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. దీంతో నీటి వసతి లేక వాటర్‌ప్లాంటు మూతపడింది. తాగునీటి కోసం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తల్లిమడుగుల గ్రామంలో వైసీపీ హయాంలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వ నిధులతో బోరుబావి తవ్వించారు. సమృద్ధిగా నీరు పడినా విద్యుత్ సౌకర్యం లేక బోరుబావి నిరుపయోగంగా మారింది. దీంతో గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు బండి నారాయణస్వామి, ఉజ్జిని, బిల్లే ప్రభాకర్ బోరుబావికి మోటారు బిగించి, ఇంటి అవసరాలకు నీరు వాడుకుంటున్నారు. ఎన్నికల అనంతరం కూటమి అధికారంలోకి రాగానే పంచాయతీ మోటారుకు ఎమ్మెల్యే పరిటాల సునీత ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు. వాటర్‌ప్లాంట్‌తోపాటు ఇంటింటా కొళాయిలు వేయించి, పైప్‌లైన్ వేయించారు.

దీంతో సర్పంచ్ రామాంజనేయులు బోరుబావికి మోటారు బిగించేందుకు యత్నించగా.. వైసీపీ నాయకులు నారాయణస్వామి, ఉజ్జిని, ప్రభాకర్ అడ్డుపడ్డారు. అంతటితో ఆగకుండా సొంతంగా జెట్ మోటారు ఏర్పాటు చేసుకుని, ప్రభుత్వ బోరుబావి వాడుకుంటున్నారు. దీంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బోరుబావి ఏర్పాటు చేసి, వాటర్ ప్లాంటు వినియోగంలోకి తెచ్చి ప్రజల దాహార్తి తీర్చాలని తల్లిమడుగుల ప్రజలు కోరుతున్నారు.

నోటీసులు ఇచ్చినా స్పందించలేదు

పంచాయతీ మోటారు ఇతరులు వాడుకుంటున్నారనే ఫిర్యాదు రాగానే నోటీసులిచ్చాం. అయినా సంబంధికులు స్పందించలేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తగు చర్యలు చేపడతాం.

- అనిల్‌కుమార్, ఎంపీడీఓ, కనగానపల్లి

కలెక్టర్స్ మీట్

వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్ పాల్గొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతోనే అభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. యూరియా కొరత, సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణ తదితర అంశాల గురించి సమావేశంలో చర్చించారు.



నేడు మహిళలకు వైద్య శిబిరాలు

ప్రారంభంకానున్న స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ సేవలు

ఏర్పాట్లపై వైద్యాధికారులతో డీఎంహెచ్ఓ ఆరా

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అన్ని వైద్య కేంద్రాల్లో బుధవారం మహిళలకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌కు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లపై వైద్యాధికారులతో డీఎంహెచ్ఓ ఈబీ దేవి మంగళవారం ఆరాతీశారు. జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. ఆరోగ్యం పట్ల మహిళలకు అవగాహన పెంచడం, వైద్యసేవలు అందించడం, పోషకాహారాన్ని తీసుకునేలా ప్రోత్సహించడం ద్వారా జీవన ప్రమాణాలు పెంచడమే ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలోని 45 ప్రాథమిక, 25 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 433 ఆరోగ్య ఉపకేంద్రాలు, మూడు ఏరియా ఆస్పత్రులు, ఏడు సామాజిక వైద్య కేంద్రాలతోపాటు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌ను అమలు చేస్తున్నట్లు వివరించారు. అక్టోబరు 2 వరకు నిర్వహించే శిబిరాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్లు హేమంత్, శ్రీనివాస్, డీఎంహెచ్ఓ ఏఓ గిరిజా మనోహర్‌రావు, ఎస్ఓ మహమ్మద్ రఫీ, పీఓలు యుగంధర్, నారాయణస్వామి, డెమో త్యాగరాజు, హెచ్ఈఓలు నాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

ప్రారంభించనున్న ఎంపీ అంబికా...

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రారంభించనున్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. జిల్లా అధికారులు, వైద్యులు హాజరు కానున్నారు.

తల్లీ.. మాటిస్తున్నా..!

- ఇక దొంగతనం చేయనే చేయను
- కటకటాల వెనుక నుంచి కన్న కూతురికి పుట్టిన రోజు కానుక
- వ్యసనంతో పతనమైన మాజీ సిపాయి.. కన్నీటి ప్రమాణం



'సర్..

ఈ రోజు నా కూతురు పుట్టిన రోజు. తనంటే నాకు చాలా ఇష్టం. ఒకసారి ఫోన్‌లో మాట్లాడిస్తారా..?' ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ, పోలీసు అధికారిని అడిగాడు అనిల్ కుమార్ పన్వార్..! అతను కాస్త కరుడుగట్టిన దొంగ. అంతకంటే ముందు దేశ సేవ చేసిన సైనికుడు.

'అట్ల ఇవ్వడం కుదరదు..! అయినా ఏం మాట్లాడుతావ్ నీ కూతురుతో..? దొంగతనం చేసి పోలీసుల అదుపులో ఉన్నానని చెబుతావా..?' అని ప్రశ్నించారు ఆ అధికారి.

'ప్లీజ్ సర్..! ఒక్కసారి మాట్లాడించండి..! తను బాగా చదువుతుంది. 95 శాతానికి పైగా మార్కులతో డిగ్రీ పూర్తి చేసింది. తనను ఐఏఎస్ లేదా ఐపీఎస్ అధికారిగా చూడాలన్నది నా కల..! నా ఫోన్ కాల్ కోసం తను ఎదురుచూస్తూ ఉంటుంది..' అని వేడుకున్నాడు.

'కూతురు' అనగానే పోలీసు అధికారి మనసు కరిగింది. అతని చేతికి ఫోన్ ఇచ్చాడు.

కూతురుకు ఫోన్ చేశాడు అనిల్..! అటువైపు నుంచి తన గారాలపట్టి ఫోన్ ఎత్తింది. 'తల్లీ.. నేనే..! హ్యాపీ బర్త్ డే..' అని శుభాకాంక్షలు తెలిపాడు. 'ఈ పుట్టిన రోజుకు నీకు అతి పెద్ద బహుమతి ఇస్తున్నాను..! అదేమిటో తెలుసా..? ఇకపై నేను దొంగతనాలు చేయను..' అని అన్నాడు. అతని భావోద్వేగం చూసి పోలీసుల కళ్లు చెమర్చాయి.

హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో.. ఈ ఏడాది ఆగస్టు 30వ తేదీ చోటు చేసుకున్న అపురూప సన్నివేశం ఇది. తూముకుంట చెక్‌పోస్టు సమీపంలోని ఎస్‌బీఐలో చొరబడి.. 11 కేజీల బంగారాన్ని ఎత్తుకుపోయిన కేసు నిందితుడు అనిల్ కుమార్ పన్వార్..! ఒకనాటి సైనికుడు..! రిటైర్ కాగానే చెడు సావాసాలు అతన్ని దొంగగా మార్చాయి. గడిచిన 16 ఏళ్లలో 14 బ్యాంకులలో 19 కిలోల బంగారాన్ని చోరీ చేశాడు. ఎనిమిదేళ్లు జైలు జీవితం గడిపాడు.

ఇప్పుడు కూతురుకు ఇచ్చిన మాటను ఈ మాజీ సిపాయి నిలబెట్టుకుంటాడా..? మారిపోయి.. కొత్త జీవితం ప్రారంభిస్తాడా..? కాలమే సమాధానం చెప్పాలి..!

(వివరాలు 6లో)

జిల్లా కేంద్రం.. అందులోనూ ప్రధాన కార్యాలయం.. అలాంటి చోటుకు పోస్టింగ్ వస్తే ఎవరైనా ఎగిరి గంతేస్తారు. పోస్టింగ్ కోసం తీవ్ర ప్రయత్నాలు కూడా చేస్తారు.. అనంతపురంలోని రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాయలంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ పోస్టులో చేరేందుకు అధికారులు వెనకడుగు వేస్తున్నారు. వరుస వివాదాలు, రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో భయపడిపోతున్నారు. అక్కడికి ఉన్నతాధికారులు ఎవరినీ నియమించలేకపోతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

హాట్ సీట్లు..!

రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రాం.. రాం..

- బాధ్యతలకు సబ్ రిజిస్ట్రార్ల వెనకడుగు
- వరుస వివాదాలు, ఒత్తిళ్లే కారణమా...?
- ప్రైవేటు వ్యక్తుల చేతిలో లాగిన్లు



రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే కీలకమైన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లడానికి అధికారులు వెనకడుగు వేస్తున్నారు. అనంతపురంలోని రామ్‌నగర్‌లో గల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోకి నగరంతోపాటు పలు పంచాయతీలు వస్తాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్ పోస్టుకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. ఆ పోస్టు అంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఇటీవల తలెత్తిన వరుస వివాదాస్పద రిజిస్ట్రేషన్లు, సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు ఇందుకు కారణాలుగా కనిపిస్తున్నాయి. రాజకీయ ఒత్తిళ్లు కూడా ఉన్నాయని తెలుస్తోంది. దీంతో ఇక్కడ పని చేయడానికి ఎవరూ ముందుకు రావట్లేదు. ఈ నేపథ్యంలో అక్కడికి ఎవరిని పంపాలో అర్థంకాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండు సబ్‌రిజిస్ట్రార్ పోస్టులున్నాయి. ఇక్కడ ఒక్కోరోజు 80 నుంచి 100 వరకు డాక్యుమెంట్లు అవుతుంటాయి. క్రయ, విక్రయదారుల రద్దీ ఎక్కువగా ఉండే ఈ కార్యాలయంలో జాయింట్-1, జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్ పోస్టులున్నాయి. పలు వివాదాస్పద రిజిస్ట్రేషన్ల నేపథ్యంలో జాయింట్-1 సబ్‌రిజిస్ట్రార్ రమణరావును సస్పెండ్ చేశారు. ఆ పోస్టులో ఇంకా ఎవరినీ నియమించలేదు. జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్ యూనస్‌ను తాడిపత్రికి బదిలీ చేశారు. ఆయన ఇంకా రిలీవ్ కాలేదు.

ఒకరు సస్పెన్షన్... మరొకరు బదిలీ

వివాదాలు... ఒత్తిళ్లు...

రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కొన్ని నెలలుగా వివాదాలకు నిలయంగా నిలుస్తోంది. కొన్ని డబుల్ రిజిస్ట్రేషన్లు ఇందుకు కారణమయ్యాయి. నగరంలోని సాయినగర్‌లో రూ.1.50 కోట్ల విలువైన రెండు దుకాణాల డబుల్ రిజిస్ట్రేషన్ తీవ్ర దుమారం రేపింది. చివరికి రాజకీయ వర్గాలు జోక్యం చేసుకున్నట్లు ప్రచారం జరిగింది. అనంతపురం రూరల్ మండలం నారాయణపురంలో 9 ఎకరాలకుపైగా భూమి డబుల్ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయమూ పోలీసులు, రెవెన్యూ అధికారుల వరకూ వెళ్లింది. కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని ఓ భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అక్కడ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి రూ.5లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికాడు. ఆ డాక్యుమెంట్‌ను ఏనీవేర్ కింద రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చేయడం వివాదానికి దారితీసింది. వీటికితోడు కార్యాలయంపై రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువగా ఉన్నాయనే విమర్శ కూడా ఉంది. కొన్ని రిజిస్ట్రేషన్ల విషయంలో సబ్ రిజిస్ట్రార్లపై ఒత్తిళ్లు అధికమవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రైవేటు వ్యక్తుల చేతిలో లాగిన్లు

రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కొన్ని పనులు ప్రైవేటు వ్యక్తులే అధికారికంగా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సబ్‌రిజిస్ట్రార్ల లాగిన్లు రెగ్యులర్ ఉద్యోగులు మాత్రమే తీసుకోవాలి. క్రయ, విక్రయదారుల థంబ్ తీసుకునే హక్కు ప్రైవేటు వ్యక్తులకు లేదు. కార్యాలయంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రైవేటు వ్యక్తులు అన్నీ తామై వ్యవహరిస్తున్నారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కొన్ని వివాదాస్పద భూములు, డబుల్ రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రైవేటు వ్యక్తులు కీలకపాత్ర పోషించారని సమాచారం. రెగ్యులర్ ఉద్యోగులు ఆసక్తి చూపకపోవడంతో ప్రైవేటు వ్యక్తులు డబ్బు కోసం పనులు చేసినట్లు తెలుస్తోంది. జాయింట్ కలెక్టర్ ఆదేశాలిచ్చినా కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల పెత్తనం కొనసాగుతుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎవరిని నియమిస్తారో..?

కార్యాలయంలోని రెండు సబ్‌రిజిస్ట్రార్ పోస్టుల్లో ఎవరిని నియమిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ఇక్కడికి ఎవరినైనా కేటాయిస్తే ప్రస్తుతం ఉన్న యూనస్ రిలీవ్ అయి తాడిపత్రికి వెళ్తారు. ఈ నేపథ్యంలో ఒక్క పోస్టునైనా భర్తీ చేయాలనే ఆలోచనలో ఉన్నతాధికారులు ఉన్నారు. సబ్‌రిజిస్ట్రార్లు ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో మరోసారి సీనియర్ అసిస్టెంట్‌నే నియమించక తప్పని పరిస్థితి నెలకొంది. సమీపంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌ను ఇక్కడికి కేటాయిస్తారనీ, అక్కడే పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌ను అక్కడే ఇన్‌చార్జిగా నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రామ్‌నగర్ కార్యాలయానికి ఎవరు వస్తారోనన్న చర్చ ఆ శాఖలో జోరుగా సాగుతోంది.

వ్యసనంతో పతనం..!

దొంగగా మారిన విశ్రాంత సైనికుడు.. ఆర్మీ నుంచి వచ్చాక 14 బ్యాంకులలో చోరీ

ఎనిమిదేళ్లు బయట.. ఎనిమిదేళ్లు జైలు జీవితం

తూమకుంట ఎస్‌బీఐ చోరీ కేసులో మళ్లీ జైలుకు..

ఉన్నత కుటుంబంలో పుట్టిన అనిల్ కుమార్ పన్వార్

హిందూపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తూమకుంట చెక్ పోస్టు వద్ద ఎస్‌బీఐలో చోరీ గుర్తు ఉంది కదా..? సెలవు రోజున బ్యాంకులో చొరబడి.. ఏకంగా 11 కిలోల బంగారాన్ని, రూ.40 లక్షల నగదును ఎత్తుకుపోయారు. ఈ కేసులో ఇద్దరు నిందితులు కాగా, వీరిలో ఒకరు మాజీ సైనికుడు..! చెడు సావాసాలు ఎంతటి గొప్పవారినైనా పతనం చేస్తాయి అనేందుకు ఇతని జీవితమే నిదర్శనం. ఒకనాడు చైనా సరిహద్దుల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహించిన వీరుడు.. ఇప్పుడు కటకటాల వెనుక శిక్ష అనుభవిస్తున్నాడు. అతని పేరు అనిల్ కుమార్ పన్వార్. హరియాణాలోని గుర్గావ్ జిల్లా మారుతీ కుంజ్ అనిల్ గ్రామం. మిలటరీ నుంచి తిరిగి వచ్చిన తరువాత అనిల్ చర్ఖీదాద్రి జిల్లా సాన్వర్ గ్రామంలో స్థిరపడ్డాడు. అనిల్ తండ్రి జైపాల్ సింగ్ మూడున్నర దశాబ్దాలపాటు మారుతీ కుంజ్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సేవలు అందించారు. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా, అనిల్‌ను దేశ సేవకోసం పంపించారు. మరో కుమారుడికి వ్యవసాయం, ఊరి పెద్దరికం బాధ్యతలను అప్పగించారు. నాలుగు వేలకు పైగా జనాభా ఉన్న ఆ పంచాయతీలో వీరి కుటుంబానికి ఎంతో మంచి పేరు ఉంది. అనిల్ ఏడేళ్లకుపైగా సైన్యంలో పనిచేశాడు. రిటైర్మెంట్ తరువాత తిరిగి వచ్చాడు. అప్పుడే స్థానికంగా పేకాటరాయుళ్లతో పరిచయం ఏర్పడింది. జూదంలో డబ్బులు పోగొట్టుకున్నాడు. భారీగా అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకు, ఎక్కువ డబ్బు సంపాదించేందుకు అడ్డదారులు వెతుక్కున్నాడు. మొదట సొంతూరు సమీపంలోని ఓ బ్యాంకులో చోరీ చేశాడు. ఆ తరువాత మరో 13 బ్యాంకులలో చోరీలు చేశాడు. మధ్య మధ్యలో జైలుకు వెళ్లి వచ్చాడు. కానీ మార్పు రాలేదు.


సీసీ టీవీ ఫుటేజీలో నిందితుడు

వచ్చిన ఏడాదిలోనే..

అనిల్ కుమార్ 2007లో ఆర్మీ నుంచి తిరిగి వచ్చాడు. ఆ తరువాత ఏడాదికే బ్యాంకులలో చోరీలను మొదలు పెట్టాడు. చోరీ చేయడం.. పోలీసులకు దొరకడం.. జైలుకు వెళ్లడం.. అక్కడే మరో చోరీకి స్కెచ్ వేయడం.. బయటకు వచ్చిన నెలలోనే మళ్లీ బ్యాంకు చోరీ చేయడం పరిపాటిగా మారిపోయింది. మొదటి దొంగతనం కేసులో అనిల్‌ను అరెస్టు చేసే సమయంలో పోలీసులు అతని తండ్రికి సమాచారం ఇచ్చారు. కొడుకు ముఖం చూసేందుకూ ఆయన ఇష్టపడలేదని సమాచారం. ఆయన సోదరుడు సైతం 'అతన్ని తీసుకెళ్లి ఏమైనా చేసుకోండి..' అని ఆవేదన వ్యక్తం చేశాడని సమాచారం. తమిళనాడులోని ఓ బ్యాంకులో చోరీ చేసిన కేసులో అనిల్ ఐదున్నరేళ్ల జైలు శిక్ష అనుభవించాడు. ఆర్మీ నుంచి బయటకు వచ్చిన ఈ 16 ఏళ్లలో ఎనిమిదేళ్లకు పైగా జైలు జీవితాన్ని గడిపాడు. బయట ఉన్న ఎనిమిదేళ్లలో 14 బ్యాంకులలో చోరీలు చేశాడు. మొత్తం 19 కిలోల బంగారాన్ని ఎత్తుకుపోయాడు. ఈ ఏడాది జూన్ 12న జైలు నుంచి బయటకు వచ్చాడు. జూలై 26న హిందూపురం మండలంలోని తూమకుంట చెక్‌పోస్టు వద్ద ఉన్న ఎస్‌బీఐ బ్రాంచిలో చోరీ చేశాడు.

రెండు సెకెన్ల వీడియో పట్టించింది..

జూలై 26వ తేదీ రాత్రి తూమకుంట చెక్‌పోస్టు సమీపంలోని బ్యాంకులో చోరీ జరిగింది. రెండు రోజులు సెలవు ఉండటంతో.. 28వ తేదీన చోరీ వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో పోలీసులకు ఎలాంటి ఆధారాలూ లభించలేదు. భారీ చోరీ కావడంతో అప్పటి ఎస్పీ రత్న, డీఎస్పీ మహేష్, అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సుమారు 15రోజులపాటు కష్టపడ్డారు. చోరీకి ముందు నెలరోజులకు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీలను సేకరించారు. సుమారు 3 వేల వీడియో క్లిప్పింగులను పరిశీలించారు. పది వేల ఫోన్ నంబర్ల వివరాలను ఆరాతీశారు. చివరకు తూమకుంట ప్రాంతంలో రికార్డు అయిన కేవలం రెండు సెకెన్ల వీడియో ఆధారంగా నిందితుడిని గుర్తించారు. 2018లో అనంతపురంలో జరిగిన బ్యాంకు దొంగతనం కేసులో ఉన్న అనిల్ అందులో ఉన్నాడు. ఆ కేసు దర్యాప్తు బృందంలో సీఐ ఆంజనేయులు (అప్పట్లో ఎస్ఐ) ఉన్నారు. దీంతో అతనిపై అనుమానం వచ్చింది. అతని స్వగ్రామంలో ఆధారాలను సేకరించారు. సాంకేతికత ఆధారంగా జూలై 27 నుంచి నెలరోజులపాటు అతని కదలికలను సేకరించారు. ఒకే ఫోన్ నంబరుతో 30మందికి పైగా లాయర్లతో మాట్లాడినట్లు గుర్తించారు. ఆ నంబరు ఆధారంగా కూపీ లాగారు. నాలుగు రోజులపాటు అక్కడే తిష్టవేసి, రేయింబవళ్లు వేటాడి అనిల్‌ను పట్టుకున్నారు.

శాటిలైట్ ఫోన్‌తో..

బ్యాంకు దోపిడీలు చేసి పట్టుబడిన ప్రతిసారీ అనిల్ అప్‌డేట్ అయ్యాడు. పోలీసులు తనను ఎలా పట్టుకున్నారో తెలుసుకుని, పట్టుబడకుండా ఉండేందుకు వినూత్న ఆలోచన చేసేవాడు. తూమకుంట చెక్ పోస్టు వద్ద బ్యాంకులో చోరీకి ఇదేలా ఆలోచించాడు. సెల్‌ఫోన్ వాడితే గుర్తిస్తారని, ఢిల్లీకి వెళ్లి రూ.7 వేలతో శాటిలైట్ ఫోన్ కొనుగోలు చేశాడు. అందులో సిమ్‌కార్డు ఉండదు. నెట్‌వర్క్ సమస్య ఉండదు. ఎక్కడి నుంచైనా మరో సాటిలైట్ ఫోన్‌కు కాల్ చేసే సదుపాయం ఉంటుంది. ఈ కాల్స్‌ను ఎవరూ గుర్తించలేరు. తూమకుంట చెక్‌పోస్టు వద్ద బ్యాంకు చోరీ సమయంలో తాను శాటిలైట్ ఫోన్ వాడానని అనిల్ పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. కోయంబత్తూరు జైలులో పరిచయమైన రాజస్థాన్‌కు చెందిన మరో నిందితుడితో కలిసి తూమకుంట చెక్‌పోస్టులో బ్యాంకు దొంగతనానికి అనిల్ ప్లాన్ వేసి, అమలు చేశాడు. అనిల్ ప్రస్తుతం హిందూపురం సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. రాజస్థాన్‌కు చెందిన మరో నిందితుడిని అక్కడి పోలీసులు వేరే కేసులో జైలులో ఉంచారు. ఇక్కడ చోరీ చేసిన బంగారంలో అధిక శాతం అతనివద్దే ఉన్నట్లు సమాచారం.


సొంతూరు వద్ద పొలంలో దాచిన చోరీ బంగారాన్ని స్వాధీనం చేసుకుంటున్న సీఐ ఆంజనేయులు, పురం వీఆర్వోలు

చాలా పద్ధతిగా..

బ్యాంకులో చోరీ చేసేందుకు సెలవు రోజులనే అనిల్ ఎంచుకునేవాడు. కనీసం రెండు రోజులు సెలవు ఉన్నప్పుడే చొరబడేవాడు. కుదువ పెట్టిన బంగారాన్ని మాత్రమే ఎత్తుకుపోయేవాడు. పర్సనల్ లాకర్లను టచ్ చేసేవాడు కాదు. తాకట్టు బంగారానికి ఇన్సూరెన్స్ ఉంటుందని, అందుకే ఆ బంగారాన్నే ఎత్తుకుపోయేవాడినని అనిల్ పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది.

అమరావతికి నూతన టీచర్లు

- జిల్లా నుంచి 45 బస్సుల ఏర్పాటు
- రేపు ఉదయం 6 గంటలకు పీవీకేకే కళాశాలకు చేరుకోవాలి
- 19న సీఎం, విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు
- డీఈఓ ప్రసాద్‌బాబు


మాట్లాడుతున్న డీఈఓలు ప్రసాద్‌బాబు, క్రిష్ణయ్య

అనంతపురం విద్య, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో టీచర్ ఉద్యోగాలు సాధించిన వారందరూ అమరావతికి బయల్దేరాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్ బాబు తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారి క్రిష్ణయ్య, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు, డీఎస్సీ సెక్షన్ ఏడీ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ ఆదినారాయణతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. డీఎస్సీలో 755 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వారందరికీ అమరావతిలో నియామక పత్రాలు అందజేస్తారన్నారు. ఈనెల 18వ తేదీన ఉదయం 6 గంటలకు అనంతపురంలోని ఆలమూరు రోడ్డులోగల పీవీకేకే కళాశాలకు అభ్యర్థులు చేరుకోవాలన్నారు. అభ్యర్థితోపాటు కుటుంబ సభ్యుడు ఒకరు తప్పకుండా రావాల్సి ఉంటుందన్నారు. జోనల్‌లో పీజీటీ, టీజీటీ పోస్టులకు ఎంపికై జిల్లాలో ఉన్నవారు కూడా ఇక్కడికే రావాల్సి ఉంటుందన్నారు. 45 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19వ తేదీ అమరావతిలో సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తారన్నారు. ఈనెల 22 నుంచి 29వ తేదీ వరకు అభ్యర్థులకు ఆయా సబ్జెక్టుల్లో జిల్లాలోనే శిక్షణ ఇస్తామన్నారు. ఆ తర్వాత పాఠశాలలకు పోస్టు కేటాయించి, పంపుతామని డీఈఓ ప్రసాద్‌బాబు వివరించారు.

డీఎస్సీలో మరో మాయ..!

(5వ పేజీ తరువాయి)

పంపారు. ఆయన పేరును చూసి విద్యాశాఖ యంత్రాంగమే నివ్వెరపోయింది. అది మరువకనే డీఎస్సీ ఎంపిక జాబితాలో అర్హత ఉన్న ఓ అభ్యర్థికి పోస్టు దక్కలేదు. ఆయన కన్నా తక్కువ మార్కులు వచ్చిన వారికి పోస్టింగ్ కల్పించి, ఎంపిక జాబితాలో పెట్టారు. ఇది వెలుగులోకి రావడంతో విద్యాశాఖ అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

అర్హత ఉన్నా.. పేరు మాయం..

ధర్మవరానికి చెందిన ఏ అంజనేయులు (బీసీ-ఏ) డీఎస్సీ రాశారు. ఆయనకు రాష్ట్రశాఖ నుంచి వెరిఫికేషన్‌కు హాజరుకావాలని కాల్‌లెటర్ వచ్చింది. పరిశీలనకు డిగ్రీలకు సంబంధించి అన్ని సర్టిఫికెట్లు ఒరిజినల్ ఉన్నా.. సెకండ్ డిగ్రీకి సంబంధించిన మార్కుల మెమో ఒరిజినల్ తీసుకురాలేదు. దీంతో ఆయన పరిశీలనను పెండింగ్‌లో ఉంచి ఒరిజినల్ డిగ్రీ మార్కుల మెమో తీసుకురావాలని చెప్పడంతో వెనుదిరిగి వెళ్లారు. ఆ తర్వాత తాను చదివిన ఎస్కే యూనివర్శిటీకి వెళ్లి ఒరిజినల్ మార్కుల మెమో కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 5వ తేదీన తిరిగి డీఈఓ కార్యాలయం నుంచి ఆంజనేయులుకు ఫోన్ చేసి, సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు. 8వ తేదీన ఆయన యూనివర్సిటీలో ఒరిజినల్ మార్కుల మెమో తీసుకుని, రాత్రికి డీఈఓ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అధికారులు ఇళ్లకు వెళ్లిపోవడంతో 9వ తేదీ ఉదయమే మళ్లీ డీఈఓ కార్యాలయానికి వచ్చి ఒరిజినల్ సర్టిఫికెట్లను అందజేశారు. అదేరోజే వాటిని పరిశీలించిన కమిటీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి పంపింది. డీఎస్సీ ఎంపిక జాబితాలో ఆయన పేరులేదు. ఆయన కన్నా తక్కువ మార్కులు వచ్చిన వారి పేర్లు జాబితాలో ఉన్నాయి. ఆంజనేయులు డీఎస్సీ ఇంగ్లిష్ సబ్జెక్టులో 76.28 మార్కులు సాధించి 48వ ర్యాంకులో ఉన్నారు. ఈ సబ్జెక్టులో ఎంపిక జాబితా ఆధారంగా 75.73 మార్కులతో 49వ ర్యాంకులో ఉన్న ధనుంజయ అనే అభ్యర్థి వరకు ఓపెన్ కేటగిరీలోనే ఎంపికయ్యారు. ధనుంజయ కంటే అంజనేయులుకు ఎక్కువ మార్కులు ఉన్నాయి. ర్యాంకు 48 కాబట్టి ఆంజనేయులు ఇంగ్లిష్‌లో ఓపెన్ విభాగంలోనే ఎంపికకావాల్సి ఉంది. అయినా.. ఆయన పేరు కనిపించలేదు. బీసీ-ఏ కేటగిరీలో ఆంజనేయులు కంటే తక్కువ మార్కులు ఉన్నవారికి పోస్టింగ్ ఇచ్చారు. ఆంజనేయులు పేరు మాత్రం జాబితాలో లేదు. దీంతో ఆయన.. డీఈఓ కార్యాలయానికి వచ్చి, విద్యాశాఖ అధికారులను కలిసి తనకు వాటిల్లిన అన్యాయాన్ని వివరించారు. అర్హుడిని పోస్టుకు ఎంపిక చేయకుండా విద్యాశాఖ మాయాజాలం ప్రదర్శించడం విమర్శలకు తావిస్తోంది.

ఆంజనేయులుకు న్యాయం చేస్తాం


ఆంజనేయులుకు ఇంగ్లిష్ సబ్జెక్టులో అర్హత ఉంది. ఎంపిక జాబితాలో పేరు రావాల్సి ఉంది. విషయాన్ని కమిషనర్‌తోపాటు డీఎస్సీ విభాగ రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. టెక్నికల్‌గా పొరపాటు జరిగింది. తప్పకుండా సరిదిద్ది, ఆంజనేయులుకు పోస్టింగ్ ఇస్తాం.

-ప్రసాద్‌బాబు, డీఈఓ

ఉన్నత విద్యామండలిలో ఇద్దరు వైస్ చైర్మన్ల నియామకం

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలిలో రెండు వైస్ చైర్మన్ పోస్టులను భర్తీ చేస్తూ ఉన్నత విద్యాశాఖ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. వైస్ చైర్మన్-1గా శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావును, వైస్ చైర్‌పర్సన్-2గా నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ రత్నశీల మణిని నియమించింది. వీరి పదవీ కాలం మూడేళ్లు. గత ప్రభుత్వం నియమించిన ఇద్దరు వైస్ చైర్మన్లలో ఒకరి పదవీకాలం ఇటీవల ముగియగా, మరొకరు రాజీనామా చేశారు. ఆయా స్థానాలను కూటమి ప్రభుత్వం ఇప్పుడు భర్తీ చేసింది.

1,482 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా



అనంతపురం అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1,482 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద వ్యాగిన్లలో వచ్చిన యూరియా బస్తాలను ఏడీఏ మంగళవారం పరిశీలించారు. ఏపీ మార్క్‌ఫెడ్‌కు 899, ప్రైవేటు డీలర్లకు 583 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తామన్నారు. 900 మెట్రిక్ టన్నుల వైట్ పొటాష్ సరఫరా వచ్చిందన్నారు.

పశుసంవర్ధక శాఖలో 15 మంది జేడీలకు పోస్టింగ్‌లు

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్ల నుంచి జాయింట్ డైరెక్టర్లుగా తాత్కాలిక పదోన్నతి పొందిన 15మందికి పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పి.ప్రేమ్‌చంద్-అనంతపురం జేడీ, జి.సుబ్బమ్మ- విజయవాడ ఎండీ కాప్, కె.శ్రీనివాసులు-విజయవాడ వీఎస్ఎస్‌హెచ్, ఎం.రత్నజ్యోతి-డైరెక్టరేట్, బి.చంద్రశేఖర్-చింతలదీవి ఎన్‌కేబీసీ, కె.మురళీకృష్ణ-విజయనగరం జేడీ, కె.భూపాల్‌రెడ్డి-డైరెక్టరేట్, డి.శంకరరావు-విశాఖపట్నం జేడీ, ప్రసాదరావు-ఏలూరు జేడీ, వెంకటేశ్వరరావు- ఒంగోలు జేడీ, టి.వి.సుధాకర్-డైరెక్టరేట్, ఉమామహేశ్వరి-చిత్తూరు జేడీ, వి.దుర్గాప్రసన్నబాబు-డైరెక్టరేట్, కెవీవీ సత్యనారాయణ-గుంటూరు జేడీ, పి.వెంకటరమణ-శ్రీకాకుళం జేడీగా నియమితులయ్యారు. కాగా తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నియంత్రణలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు రాయల్ రెడ్డి, శివసాగర్‌రెడ్డిల డిప్యూటేషన్‌ను మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

టమోటా కిలో రూ.16

అనంతపురంరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక టమోటా మార్కెట్‌లో మంగళవారం టమోటా కిలో రూ.16తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.9, సరాసరి ధర రూ.12తో విక్రయాలు జరిగాయని పేర్కొన్నారు. మార్కెట్‌కు 1650 టన్నుల టమోటాలు వచ్చినట్లు తెలిపారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరిధర రూ.12వేలు పలికాయని వివరించారు. మార్కెట్‌కు మొత్తంగా 548 టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు తెలిపారు.

మళ్లీ వెతలు..!

- జేఎన్‌టీయూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన
- వేతనాల చెల్లింపు బాధ్యతలు ఏజెన్సీకి అప్పగింత
- ఈనెల నుంచే అమలులోకి..
- నేటికీ అందని వేతనాలు



అనంతపురంరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిధిలో వారంతా చిరుద్యోగులు. నెలవారీగా సకాలంలో వచ్చే వేతనాలతో జీవనం నెట్టుకొస్తున్నారు. ఏజెన్సీ అనే మాట వారిపై పిడుగులా పడింది. అభద్రత అనే భయం పుట్టుకొచ్చింది. భవిష్యత్తులో ఎప్పుడు, ఎలాంటి పరిణామాలు చవిచూడాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. జేఎన్‌టీయూ పరిధిలో అవుట్ సోర్సింగ్ కింద వందలాది మంది పనిచేస్తున్నారు. వీరి వేతన చెల్లింపు ప్రక్రియ మళ్లీ ఏజెన్సీ వద్దకు చేరింది. ఈనెల నుంచి కార్తికేయ అనే ఏజెన్సీ ద్వారా ఉద్యోగులకు వేతనాలు చెల్లించనున్నారు. దీంతో సంబంధిత వర్గాల్లో నెలవారిగా వేతన చెల్లింపు, ఉద్యోగ భద్రత, ఇతరత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వేతనాలు సక్రమంగా చెల్లించకపోతే తమ పరిస్థితి ఏంటన్న అభిప్రాయాలు ఆయావర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

600 మందికిపైగా ఉద్యోగులు

జేఎన్‌టీయూలో వివిధ ఉద్యోగాల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించుకున్నారు. పదుల సంఖ్యలో ప్రారంభమైన ఉద్యోగుల సంఖ్య ప్రస్తుతం వందల్లోకి చేరింది. యూనివర్సిటీలో 274, పులివెందుల ఇంజనీరింగ్ కళాశాలో 150, కలికిరి ఇంజనీరింగ్ కళాశాలలో 120, క్యాంపస్ ఇంజనీరింగ్ కళాశాలలో 80, ఓటీపీఆర్ఐలో 26 మంది కలిపి మొత్తం 650 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు.


ఆప్కాస్ నుంచి ఏజెన్సీకి..

అనంతపురం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల నుంచి విశ్వవిద్యాలయం రూపాంతరం చెందిన అనంతరం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఏజెన్సీల ద్వారా చెల్లిస్తుండేవారు. గత ప్రభుత్వం ఆప్కాస్‌ను ఏర్పాటు చేసి, నేరుగా వేతనాలు చెల్లించేది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత జేఎన్‌టీయూ ద్వారా గత నెల వరకు వేతనాలు చెల్లించారు. కోతలు లేకుండా వేతనం మొత్తం ప్రతినెలా రెండు, మూడు తేదీల్లోనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాల్లో జమ అయ్యేది. దీంతో వారికి వేతనం గురించి చింతించాల్సిన అవసరం లేకుండా పోయింది. ప్రస్తుతం మళ్లీ ఏజెన్సీల ద్వారా వేతనాల చెల్లింపునకు చర్యలు మొదలయ్యాయి. దీంతో ఉద్యోగుల్లో ఆందోళనలు నెలకొన్నాయి. ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లిస్తే బాగుంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

నేటికీ అందని వేతనాలు

ఈనెల నుంచి విశ్వవిద్యాలయం పరిధిలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రస్తుత ఏజెన్సీ ద్వారా వేతన చెల్లింపులు ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటి వరకు సదరు ఉద్యోగుల ఖాతాల్లోకి వేతనాలు జమలేదు. దీంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రానున్న రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందో అన్న భయం ఆయా వర్గాల్లో నెలకొంది.

ఉద్యోగులకు ఇబ్బందులు ఉండవు



అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మొదటి నుంచి ఏజెన్సీల ద్వారానే వేతనాలు చెల్లింపులు జరుగుతున్నాయి. ఏజెన్సీలకు వర్సిటీ వేతనాలు చెల్లిస్తుంది. ఉద్యోగులకు ఇబ్బందులు ఉండవు.

- కృష్ణయ్య, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూ


తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు బ్రేకులు..!

- వేధిస్తున్న డ్రైవర్ల కొరత
- మరమ్మతులు పట్టించుకోని కాంట్రాక్టు సంస్థ
- చంటిబిడ్డ తల్లులకు తప్పని తిప్పలు

కొత్తచెరువు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి)ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం తరువాత తల్లీబిడ్డను ఇంటికి సురక్షితంగా తీసుకెళ్లే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు బ్రేకులు పడుతున్నాయి. వేతనాలు తక్కువగా ఇస్తుండడంతో డ్రైవర్లు రావట్లేదు. వాహనాలు మరమ్మతుల బారినపడితే చేయించేవారు కూడా లేరు. దీంతో వాహనాలు ఆగిపోతున్నాయి. చంటిబిడ్డ తల్లులు ఇబ్బందులు పడుతున్నారు.

వైసీపీ నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వం వాహనాల నిర్వహణను అరబిందో సంస్థకు అప్పజెప్పింది. కంపెనీకి నిధులు విడుదల చేయకపోవడంతో వాహనాల నిర్వహణ భారంగా మారింది. వాహనాల మరమ్మతులు చేయించలేని, డ్రైవర్లకు సైతం జీతాలు ఇవ్వలేని దుస్థితి తలెత్తిందని సదరు కంపెనీ ప్రతినిధులు వాపోతున్నారు. డ్రైవర్లు కూడా రాకపోవడంతో వాహనాలు చాలా ఆస్పత్రుల్లో నిలిచిపోయాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 36 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఉన్నాయి. వీటిలో అనంతకు 24, శ్రీసత్యసాయి జిల్లాకు 12 కేటాయించారు. అంతపురం సర్వజనాస్పత్రి పరిధిలో 13 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తున్నాయి. 6 వాహనాలు మరమ్మతుల బారిన పడ్డాయి. మిగిలిన వాటిని ఆయా పట్టణాలు, మండలాల్లోని వైద్య కేంద్రాలకు కేటాయించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 12 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు నడుస్తున్నాయి. ఒకటి మాత్రమే మరమ్మతులకు వచ్చింది. మిగిలిన వాటిలో హిందూపురం జిల్లా ఆస్పత్రి పరిధిలో 3, కదిరిలో 2, ముదిగుబ్బ, పెనుకొండ, రొళ్ల, మడకశిర, ధర్మవరం, గోరంట్ల మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున పనిచేస్తున్నాయి.


ధర్మవరం ఆస్పత్రి ఆవరణలో ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్

ఆసక్తి చూపని డ్రైవర్లు

వైసీపీ హయాంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు నెలకు రూ.7,870 చెల్లిస్తుండేవారు. ఆ వేతనానికి పనిచేసేందుకు డ్రైవర్లు ముందుకు రావట్లేదు. దీంతో వాహనాల నిర్వహణ కష్టంగా మారింది. ఈ సమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం డ్రైవర్ల వేతనాన్ని రూ.9,153కి పెంచింది. ఆ జీతం కూడా చాలట్లేదని డ్రైవర్లు అంటున్నారు. కియలో రూ.20 వేలుపైగా వేతనం ఇస్తుండడంతో ఎక్కువ భాగం డ్రైవర్లు ఆ కంపెనీలోని బస్సులకు వెళ్తున్నారు. దీంతో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు డ్రైవర్ల కొరత వెంటాడుతున్నట్లు తెలుస్తోంది.

ఒక్కోసారి ఇద్దరిని..

ఆస్పత్రి నుంచి తల్లీబిడ్డను ఇంటి వద్దకు వదిలిపెడితే రూ.895 అరబిందో సంస్థకు ప్రభుత్వం చెల్లిస్తుంది. జిల్లాలో కొన్నిచోట్ల తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇద్దరేసి తల్లీబిడ్డలను తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకేసారి ఇద్దరిని తరలించి రెండు బిల్లులను ప్రభుత్వం నుంచి కాజేస్తున్నారన్న విమర్శలు వినబడుతున్నాయి. డ్రైవర్లు కూడా చంటిబిడ్డ కుటుంబ సభ్యుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని కొంతమంది బాధితులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో సమస్యలను పరిష్కరించి, తల్లీబిడ్డ వాహనాలను అందుబాటులో ఉంచాలని జనం కోరుతున్నారు.

వాహనాలను వినియోగంలోకి తెస్తాం

ఉమ్మడి జిల్లాలో నిలిచిపోయిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తెచ్చేలా ఇప్పటికే అరబిందో సంస్థతో చర్చించాం. ఒకేసారి వాహనంలో ఇద్దరేసి తల్లీబిడ్డలను తరలించేవారిపై నిఘాపెడతాం. డ్రైవర్లు డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం.

-శంకర్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల జిల్లా కోఆర్డినేటర్

ఆనతినియ్యారా.. స్వామీ..!

(5వ పేజీ తరువాయి)

గోపురాలకు స్వర్ణ కలశాల ఏర్పాటు, కుంభాభిషేకానికి ముహూర్తాన్ని నిర్ణయించారు. దక్షిణాయణ కాలం పూర్తయిన వెంటనే, ఫిబ్రవరిలో స్వర్ణ కలశాల స్థాపన, స్వామి వారి ఆలయంలో తొలిసారి కుంభాభిషేకాన్ని నిర్వహించడానికి రంగం సిద్ధంచేశారు. భక్తుల వసతి గదులు, కల్యాణ మండపాలకు మరమ్మతులు చేపట్టారు.


స్కెచ్ సిద్ధం

నెట్టికంటి ఆంజనేయుడి గర్భాలయాన్ని పూర్తిగా రాతితో జీర్ణోద్ధరణ చేసేందుకు స్కెచ్‌ను తయారు చేశారు. రాతి గర్భగుడిని నిర్మించడానికి గుంతకల్లు ఆర్యవైశ్య సంఘం సంసిద్ధతను వ్యక్తంచేసింది. దీంతో అధికారులు ఖర్చు అంచనాలను సిద్ధం చేస్తున్నారు. రాతి గర్భగుడి నిర్మాణానికి రూ.2 కోట్లు అవుతుందని భావిస్తున్నామని, ఆ మొత్తాన్ని సమకూరుస్తామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా జగదీశ్, కార్యదర్శి కృపాకర్ తెలిపారు. ఆలయానికి ఈశాన్యంలో కోనేటిని నిర్మించడానికి పువ్వాడి చంద్రశేఖర్ ముందుకు వచ్చారు. దాదాపు 8 సెంట్ల స్థలాన్ని కానుకగా ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. దీంతో కోనేటి స్కెచ్‌ను, ఖర్చు అంచనాలను అధికారులు తయారు చేస్తున్నారు. ఆలయం లోపల ఉన్న యాగశాలను ప్రస్తుత గోశాల పక్కకు మార్చడానికి, గోశాల స్థలంలో ప్రసాదాల తయారీ షెడ్డును, ప్రసాదాల అమ్మకపు కౌంటర్లను నిర్మించడానికి ప్రతిపాదనలను తయారు చేస్తున్నామని ఈఓ వివరించారు. మరో ఖాళీ స్థలంలో గోశాలను నిర్మిస్తున్నారు. అన్నదాన శాలను పోలీసు చెక్ పోస్టు వద్ద నిర్మించాలని నిర్ణయించారు. అక్కడ ఉన్న (దేవస్థానం ఎదుట) దుకాణాలను వేరేచోటుకు తరలిస్తామని ఈఓ తెలిపారు.

గదులకు మరమ్మతులు

ఆలయంలో సమస్యాత్మకంగా మారిన వసతి గదుల మరమ్మతులను చేపట్టారు. ఆలయానికి తూర్పున ఉన్న ఏసీ కాటేజీ మరమ్మతులు జరుగుతున్నాయి. వీటికి ఆనుకుని ఉన్న గంగా నిలయం కల్యాణ మండపానికి మరమ్మతులను పూర్తిచేసి, రంగులు వేస్తున్నారు. ఆలయానికి ఎదురుగా ఉన్న కేసరి సదనానికి త్వరలో మరమ్మతులు చేపట్టనున్నారు. బెంగళూరుకు చెందిన ఓ దాత 55 గదులతో వసతి సముదాయాన్ని నిర్మించడానికి ముందుకు వచ్చారని ఈఓ తెలిపారు. ఈ నిర్మాణానికి సంబంధించిన ప్లాన్, ఖర్చు అంచాలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. దేవస్థానం లోపల ఉన్న దేవదాయశాఖ కార్యాలయం, ధర్మకర్త కార్యాలయం, లడ్డూ తయారీ కేంద్రాన్ని వెలుపలకు తరలిస్తామని ఈఓ తెలిపారు.

దాతలతోనే అభివృద్ధి..



ఆలయానికి ఆదాయం కంటే వ్యయం అధికంగా ఉంటోంది. దేవస్థానానికి హుండీలు, కౌలు, అద్దెలు, టిక్కెట్లు తదితరాల ద్వారా రూ.12 కోట్ల ఆదాయం వస్తోంది. కానీ అంతకు మించి జీతాలు, ప్రసాదాల తయారీ, చట్టపరమైన చెల్లింపులకు ఖర్చు అవుతోంది. అభివృద్ధి జరగాలంటే దాతల వల్ల మాత్రమే సాధ్యమౌతుంది. అందుకే వారి సహాయాన్ని అర్థించాము. నెలలోనే దాతల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. తొలుత బంగారు కలశాల ఏర్పాటు, కుంభాభిషేకం సంకల్పించాము. దాతల ఆసక్తిమేరకు చెప్పిన అభివృద్ధి కార్యక్రమాలన్నీ చేపడతాం. భక్తుల వసతికి తొలి ప్రాధాన్యం ఇస్తాం.

-విజయరాజు, ఈఓ, కసాపురం దేవస్థానం

క్రైం కార్నర్

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

హాస్టల్ గదిలో చున్నీతో ఉరి



ధనలక్ష్మి (ఫైల్)

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోటరీపురం సమీపంలోని ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థిని కె. ధనలక్ష్మి(21) ఆత్మహత్యకు పాల్పడింది. కాలేజీ హాస్టల్ గదిలో మంగళవారం ఉరి వేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు, పెనుకొండ పట్టణంలోని ఒగ్గప్ప కుంట కాలనీకి చెందిన నాగరాజు కూతురు ధనలక్ష్మి. సీఎస్ఈ తృతీయ సంవత్సరం చదువుతోంది. కాలేజీ ఎన్‌సీసీ శిక్షణలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పాల్గొంది. సాయంత్రం నాలుగున్నర గంటలకు హాస్టల్ గదికి వెళ్లి.. చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఆ సమయంలో సహ విద్యార్థినులు స్నాక్స్ కోసం వెళ్లారు. వారు తిరిగి వచ్చి గది తలుపులు తట్టినా ధనలక్ష్మి స్పందించలేదు. దీంతో కాలేజీ సిబ్బందిని పిలిపించి, తలుపులను బద్ధలుకొట్టారు. అప్పటికే ధనలక్ష్మి మృతి చెందింది. సీఐ పుల్లన్న, ఎస్ఐ రాంప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కళాశాల సిబ్బందిని, విద్యార్థులను విచారించారు. గదిలో సూసైడ్ నోట్ ఉందేమోనని పరిశీలించారు. ధనలక్ష్మి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాల్‌డేటాను సేకరించారు. సెల్‌ఫోన్ లాక్ అయిందని, సాంకేతిక నిపుణల చేత ఓపెన్ చేయించి, వివరాలు సేకరిస్తామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడికి చేరుకున్న ధనలక్ష్మి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం కాలేజీ హాస్టల్ గదికి వెళ్లి పరిశీలించారు. తన కూతురు మృతికి కారణం ఏమిటో తెలియదని, ఈనెల 13 వరకూ ఇంటి వద్ద ఉండి, కాలేజీకి వచ్చిందని విద్యార్థిని తండ్రి నాగరాజు పోలీసులతో అన్నారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి



శివబచ్చన్ మృతదేహం

సోమందేపల్లి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తికుంటపల్లిలో అతిగా మద్యం తాగి శివబచ్చన్(44) మంగళవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శివబచ్చన్ కొన్నేళ్ల క్రితం మహారాష్ట్ర నుంచి హిందూపురానికి వలస వచ్చాడు. ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయలుదేరిన అతడు అతిగా మద్యం తాగి, పత్తికుంటపల్లి వద్ద మృతిచెందాడు. శివబచ్చన్‌కు భార్య రమాదేవి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పెనుకొండకు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న నక్కా ఓబులేసు

పామిడి, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరపల్లికి చెందిన రైతు నక్కా ఓబులేసు సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నక్కా ఓబులేసు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పంటలు పండక అప్పులపాలయ్యాడు. వాటిని తీర్చేందుకు ఇటీవల రెండెకరాల పొలం అమ్మేశాడు. భూమి కొనుగోలు చేసిన అప్పేచెర్ల చంద్రశేఖర్‌కు నక్కా ఓబులేసుకు బోరుబావి విషయంలో వివాదం తలెత్తింది. దీంతో చంద్రశేఖర్.. ఓబులేసు అన్నదమ్ముల భూమిలోని పైపులను ధ్వంసం చేశాడు. ఈ పరిణామాలతో మనస్తాపం చెందిన ఓబులేసు సోమవారం పొలంలోనే పురుగుల మందు తాగాడు. రాత్రి అయినా అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడిపోయాడు. వెంటనే పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఆత్మహత్యాయత్నంపై పోలీసులను అడగ్గా.. ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రైలుకిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

హిందూపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుడ్డం ప్రాంతంలో రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శశికుమార్ తెలిపారు. సుమారు 25 సంవత్సరాల వయసుగల యువకుడు మంగళవారం ఉదయం 11గంటల సమయంలో రైలుకిందపడి దుర్మరణం చెందాడు. లోకోపైలెట్ సమాచారంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9441145833ను సంప్రదించాలని సూచించారు.

హమాలీ ఆత్మహత్య



పరమేశ్వర్ రెడ్డి (ఫైల్)

తాడిపత్రి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫ్లైఓవర్ సమీపాన మంగళవారం రైలుకింద పడి హమాలీ పరమేశ్వర్ రెడ్డి (46) ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీనివాసపురంలోని ఆంజనేయస్వామి మాన్యం ప్రాంతానికి చెందిన పరమేశ్వర్‌రెడ్డి హమాలీ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి డబ్బులివ్వాలని ఇంట్లో ఒత్తిడి చేసేవాడు. కొంతకాలంగా పనులు లేకపోవడంతో మానసిక అనారోగ్యం బారిన పడ్డాడు. గట్టిగా అరుస్తూ, కేకలు వేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెంది మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పరమేశ్వర్ రెడ్డికి భార్య కౌసల్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అర్హులందరికీ పథకాలు

- ఆధారాలతో వస్తే న్యాయం
- జడ్పీ సమావేశంలో ఎంపీ అంబికా
- ఆర్డీటీ అంశంపై చైర్‌పర్సన్‌తో వాగ్వాదం
- వైద్యం, యూరియా సమస్యలను లేవనెత్తిన సభ్యులు



సమావేశంలో ఎంపీ అంబికా, చైర్ పర్సన్ గిరిజమ్మ, జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. అర్హత ఉండి పథకాలు అందనివారు తగిన ఆధారాలతో వస్తే న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరికి 'తల్లికి వందనం' సొమ్ము జమ కాలేదని, విద్యాశాఖ అధికారులు సమాధానం ఇవ్వాలని సభ్యులు డిమాండ్ చేయడంతో ఎంపీ స్పందించారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. సమావేశానికి ఎమ్మెల్సీ మంగమ్మ, జేసీలు శివనారాయణ శర్మ, అభిషేక్ కుమార్, జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. చైర్ పర్సన్ గిరిజమ్మ సర్వసభ్య సమావేశాన్ని ప్రారంభించారు. జిల్లాలో విద్య, వైద్య శాఖ ప్రగతిని వివరించాలని అధికారులకు సూచించారు. ఈ లోగా తల్లికి వందనం గురించి సభ్యులు నిలదీశారు. ఉమ్మడి జిల్లాలో ఎంత మంది అర్హులున్నారు, ఎంత మంది తల్లుల ఖాతాలో సొమ్ము జమ అయిందీ చెప్పాలని బుక్కరాయసముద్రం జడ్పీటీసీ భాస్కర్ తదితరులు డిమాండ్ చేశారు.

రైతులను ఆదుకోవాలి: గిరిజమ్మ

ఉమ్మడి జిల్లాలో రైతులను పాలకులు ఆదుకోవాలని చైర్ పర్సన్ గిరిజమ్మ కోరారు. యూరియా సరఫరా, మొక్కజొన్న కొనుగోలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సభ్యులు కోరగా, ఆమె స్పందించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపడుతున్నారని ప్రశ్నించారు. మార్కెటింగ్ శాఖ అదే పనిమీద ఉందని జేడీఏ ఉమామహేశ్వరమ్మ అన్నారు. 'పని మీద ఉండటం కాదు.. వెంటనే కొనుగోలు చేసేలా చూడండి' అని గిరిజమ్మ సూచించారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏని పునరుద్ధరించేలా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని గిరిజమ్మ అన్నారు. ఆర్డీటీ సమస్యను పలువురు సభ్యులు సభలో ప్రస్తావించారు. సభలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని జడ్పీటీసీ నాగరాజు పట్టుబట్టారు. ఇప్పటికే ఒకసారి తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించామని, అయినా అమలు కాలేదని చైర్ పర్సన్ అన్నారు. మరోసారి తీర్మానం చేసి పంపుదామని అన్నారు. ఈ అంశంపై ఎంపీ అంబికా, చైర్ పర్సన్ గిరిజమ్మ మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. ఈ సమస్య 2023లోనే తలెత్తిందని, అప్పటికే ఖాతాలు సీజ్ చేశారని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాతో చర్చలు జరిపామని ఎంపీ అంబికా అన్నారు. కొత్త ఖాతాలను ప్రారంభించడానికి కొంత సమయం పడుతుందని, ఆ ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. వీలైనంత త్వరగా పూర్తి అవుతుందని, ఆర్డీటీకి పూర్వ వైభవం తెస్తామని అన్నారు.



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న జడ్పీటీసీలు

మేమేం ఉన్నోళ్లం కాదు..

'నిధులు లేవు.. విధులు లేవు. పేరుకే ప్రజాప్రతినిధులం. మా మాట చెల్లుబాటు కావడం లేదు. మూడేళ్ల నుంచి గౌరవ వేతనం ఇవ్వడం లేదు. ఇతర రాష్ట్రాలలో రూ.13 వేల గౌరవ వేతనం ఇస్తున్నారు. ఇక్కడ ఇస్తారా..? లేదా..?' అని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీటీసులు అందరూ ఆర్థికంగా ఉన్నవారేనని అనుకోవద్దని అన్నారు. గౌరవ వేతనం ఇవ్వకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. కావాలంటే జడ్పీటీసీ, ఎంపీటీసీ వ్యవస్థలను రద్దు చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్యశాలలో ఆకతాయిలు..

ప్రభుత్వ వైద్యశాలలో ఆకతాయిలు వైద్య విద్యార్థులను వేధిస్తున్నారని కొందరు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వెళితే వైద్య పరీక్షలన్నీ బయటకు రాయిస్తున్నారని అన్నారు. ఆదివారం వస్తే సొంత క్లినిక్‌లకు వెళ్లి పేదలను దోచుకుంటున్నారని అన్నారు. గుమ్మఘట్ట ఎంపీడీఓ ప్రొటోకాల్ పాటించడం లేదని ఎంపీపీ సభ దృష్టికి తెచ్చారు. అనంతపురం రూరల్ మండలంలో అనామకుల చేత ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని జడ్పీటీసీ చంద్రమోహన్ సభ దృష్టికి తెచ్చారు., తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

డీఈఓ లేరని..

తల్లికి వందనం వివరాలను వెల్లడించాలని చైర్ పర్సన్ సూచించారు. కానీ డీఎస్సీ నియామక ప్రక్రియలో బిజీగా ఉన్న డీఈఓ ప్రసాద్ బాబు సభకు హాజరు కాలేదు. తమకు వివరాలు తెలియవని కార్యాలయ సిబ్బంది అన్నారు. దీంతో సభ్యులు కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను ఒక జడ్పీటీసీ. నాకు ఇద్దరు పిల్లలు. జడ్పీ పాఠశాలలోనే చదువుతున్నారు. అయినా తల్లికి వందనం పడలేదు. కారణం ఏమిటి..? బాధ్యులు ఎవరు..? నేనే జడ్పీటీసీ అయినందుకే సొమ్ము జమకాలేదా..? సభ జరిగిన ప్రతిసారీ ఈ సమస్యను లేవనెత్తుతున్నాం. అధికారులు తప్పించుకు తిరుగుతున్నారు..' అని జడ్పీటీసీ భాస్కర్ అన్నారు. జేసీ శివనారాయణ శర్మ జోక్యం చేసుకుని, వివరాలు చెప్పే ప్రయత్నం చేయడంలో చైర్ పర్సన్ గిరిజమ్మ అడ్డుకున్నారు. 'అన్ని వివరాలను మీరే చెబితే ఇక మిగిలిన అధికారులు ఎందుకు..?' అని ప్రశ్నించారు. డీఈఓ రాలేకపోయారని, సిబ్బందికి అవగాహన లేనందున తానే చెబుతానని జేసీ అన్నారు. నిబంధనల మేరకు ఆదాయ పన్ను చెల్లించేవారికి, ప్రభుత్వ ఉద్యోగులకు తల్లికి వందనం వర్తించదని అన్నారు. అర్హత ఉండి రాకపోతే ఆధారాలను విద్యాశాఖ అధికారులకు ఇవ్వాలని సూచించారు.

టీచర్లపై యాప్‌ల భారం తగ్గించాలి

స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి



బేగార్లపల్లి పాఠశాలలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న కాడిశెట్టి శ్రీనివాసులు

మడకశిర టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు అన్నారు. ఆయన మంగళవారం మడకశిర మండలంలో పర్యటించారు. పట్టణంలోని ఎంఆర్‌సీలో జిల్లా సబ్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు, ఇతర బాధ్యతల వల్ల పాఠ్యాంశాల బోధనకు సమయం సరిపోవడం లేదన్నారు. 2023 జూలై నుంచి 12వ వేతన సవరణ అమలు చేయాల్సి ఉండగా నేటికి పీఆర్సీని నియమించకపోవడం దారుణమన్నారు. ఎన్నికలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బేగార్లపల్లి పాఠశాలతో పాటు మండలంలో పలు పాఠశాలలు పర్యటించి సభ్యత్వ నమోదు నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.క్రిష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు మారుతీప్రసాద్, జిల్లా కోశాధికారి ప్రదీప్‌కుమార్, నాయకులు రమేష్, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన రెండేళ్లకు ఛేదింపు



రాజేశ్వరి, ఆమె పిల్లలను చూపుతున్న ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యమైన కేసును రెండేళ్ల తరువాత ధర్మవరం రూరల్ పోలీసులు ఛేదించారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోతుకుంట బృందావనం కాలనీకి చెందిన వడ్డే రాజేశ్వరి, వడ్డే శివ దంపతులకు కుమారుడు నిఖిల్, కుమార్తె చైతన్యశ్రీ ఉన్నారు. కొన్ని కారణాలతో వడ్డే రాజేశ్వరి.. కుమారుడు, కుమార్తెను తీసుకుని రెండేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయంపై 2023లో శివ.. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పట్లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. తల్లి, ఇద్దరు పిల్లలు బెంగళూరులో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్లి వారిని పిలుచుకొచ్చారు. తహసీల్దార్ సురేష్‌బాబు ఎదుట హాజరుపరిచి, గ్రామానికి పంపించారు.

దొంగల స్వైర విహారం



పూజమ్మ ఆలయంలో చెల్లాచెదురుగా పడి ఉన్న దుస్తులు

రొద్దం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి దొంగలు స్వైరవిహారం చేశారు. రెండు ఆలయాలు, ఇంట్లోకి చొరబడ్డారు. మండలంలోని సుబ్బరాయప్పకొట్టాల గ్రామ సమీపంలో ఉన్న పూజమ్మ దేవాలయం తాళాలు పగలకొట్టి అందులో చొరబడ్డారు. 3 కిలోల వెండి, రూ.30 వేల నగదు చోరీ చేశారు. పెన్నానది ఒడ్డున ఉన్న సాయిబాబా ఆలయంలోకి చొరబడి బీరువాను పగులకొట్టారు. అందులో ఏమీ దొరకలేదు. పక్కనే ఉన్న కుర్లపల్లి అంజినరెడ్డి ఇంటి తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించి, బీరువాను ధ్వంసం చేశారు. ఏమీలేకపోవడంతో వెనుదిరిగారు. అటునుంచి పెన్నానది గట్టున మొక్కజొన్న యంత్రంలో ఉన్న టూల్ కిట్స్ జాకీని ఎత్తుకెళ్లారు. ఉదయం సమాచారం అందుకున్న ఎస్ఐ నరేంద్ర ఆలయంలో క్లూస్ టీమ్‌తో తనిఖీ చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రీడా పోటీలు వాయిదా

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం నుంచి నిర్వహించాల్సిన క్రీడాపోటీలు అనివార్య కారణాలతో వాయిదావేసినట్లు స్కూల్ గేమ్స్ సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. 17న వెయిట్ లిఫ్టింగ్, సాఫ్ట్ టెన్నిస్, స్కేటింగ్, 18న జూడో, కురాష్, టేబుల్ టెన్నిస్, 19న రెజ్లింగ్, తైక్వాండో పోటీలు జరగాల్సి ఉందన్నారు. మెగా డీఎస్సీ అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేసే కార్యక్రమం రాజధాని అమరావతిలో నిర్వహించనున్న నేపథ్యంలో పోటీలు వాయిదా వేశామన్నారు. తదుపరి తేదీలు, వివరాలకు 7989737474 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు అర్చకుల సమావేశం

అనంతపురం టౌన్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో బుధవారం అర్చకుల సమావేశం నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అసిస్టెంట్ కమిషనర్లు హాజరవుతారన్నారు. అర్చకుల సమస్యలపై చర్చిస్తారని ఆయన తెలిపారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ



వైద్య కళాశాల వద్ద మాట్లాడుతున్న రామకృష్ణ తదితరులు

పెనుకొండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పది ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం దుర్మార్గమైన ఆలోచన అని సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. పెనుకొండ సమీపంలో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల భవనాలను ఆయన జిల్లా కమిటీ సభ్యులు హరి, ప్రవీణ్, జంగాలపల్లి పెద్దన్న, వివిధ ప్రజాసంఘాల నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలలను ప్రభుత్వమే తక్షణం పూర్తి చేయాలన్నారు. అలా కాకుండా పీపీపీ విధానం ద్వారా వైద్య కళాశాల నిర్మాణం చేపడితే పేద, మధ్యతరగతి విద్యార్థులు నష్టపోతారన్నారు. ఈ కళాశాలలను ప్రభుత్వమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను, యువతను అందరినీ కలుపుకుని ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు బాబావలి, గంగాధర్, మహబూబ్‌బాషా, నాగరాజు, హనుమంతు, సుధాకర్, హబీబ్‌వలి, రైతు సంఘం నాయకులు ఫక్రుద్దీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

వివక్షను ఎదుర్కొని.. ఆదర్శంగా ఎదిగారు

పూలే దంపతుల అడుగుజాడల్లో నడుద్దాం: ఎంపీ



సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, జడ్పీ చైర్‌పర్సన్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పూలే దంపతులు వివక్షను ఎదుర్కొని, ఆదర్శంగా ఎదిగారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వారి అడుగుజాడల్లో నడుద్దామని పిలుపునిచ్చారు. స్థానిన జిల్లా పరిషత్ ఆవరణలోని జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ.. సావిత్రీబాయి పూలే టీచర్‌గా ఎన్నో అడ్డంకులను అధిగమించి, సమాజం కోసం పోరాటం చేశారని గుర్తుచేశారు. ఆమెకు జ్యోతీబాయి పూలే పూర్తి సహకారం అందించారన్నారు. బీసీలకు 43 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న దానిపై చర్చ జరుగుతోంది. అది అమలైతే బీసీలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల వారికి సమాన అవకాశాలు కల్పించాలని పూలే దంపతులు పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జాయింట్ కలెక్టర్లు శివనారాయణశర్మ, అభిషేక్ కుమార్, జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ రగ్బీ, ఉషూ జట్లను మంగళవారం ఎంపిక చేశారు. జట్టు వివరాలను స్కూల్ గేమ్స్ సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు వెల్లడించారు. రగ్బీ బాలికల అండర్-14 జట్టుకు లలితప్రియ, వర్ష, చైతన్య, మానస, యశశ్విని, అనిత, సురేఖ, చిత్ర, జ్ఞానదీపిక, స్వప్న, నవ్య, హిమబిందు, వర్షిత, శశికళ ఎంపికయ్యారు. బాలురలో పవన్, అభి, శ్రీసూర్య, సుషాంత్, వాసుదేవ్, అరుణ్‌కుమార్, లలిత్‌కిషోర్, ధనుంజయ, తేజసింహ, రామ్‌చరణ్, యశ్వంత్, మహేశ్వర్‌నాయుడు, దినేష్, మనోజ్ రెడ్డి, రంజిత్, వరుణ్ సందేశ్, భరత్‌కుమార్ ఎంపికయ్యారు. ఉషూ అండర్-17 బాలుర జట్టుకు నరేష్, రవితేజ, మణికంఠ, అరుణ్, వంశీకృష్ణ, ఉదయ్‌కుమార్, యశ్వంత్, శివతేజ, ధనుష్, ప్రశాంత్, అండర్-19కు నందకిశోర్, నరసింహ, కార్తీక్, లోకనాథ్, సురేంద్ర, రఘునాథ్, హర్ష, మధుకిరణ్, జగన్మోహన్ రెడ్డి, కుమార్ ఎంపికయ్యారు. అండర్-14, 17, 19 విభాగాల్లో కరాటే, ఆర్చరీ జట్లకు 36 మందిని ఎంపిక చేశారు.

ఆయా జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, ఎస్‌జీఎఫ్ సభ్యులు పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, నరసింహారెడ్డి, పీఈటీలు నిరంజన్ రెడ్డి, ఓబులేసు, సమీరా, రేఖ, లీలారాణి, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన రగ్బీ జట్టు

న్యూస్ బాక్స్

ఎరువుల దుకాణాలు తనిఖీ



ఎరువులను పరిశీలిస్తున్న విజిలెన్స్, వ్యవసాయ అధికారులు

నార్పల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. పుడమి అగ్రిమార్ట్, మన గ్రోమోర్ కేంద్రం, సంకల్ప కేంద్రం, నార్పల రైతు సేవా సహకార సంఘం ఎరువుల దుకాణాలను వారు తనిఖీ చేశారు. పుడమి అగ్రిమార్ట్, సంకల్ప ఎరువుల దుకాణాలలో భౌతిక నిల్వలకు, స్టాక్ రిజిస్టర్‌లో తేడాలు గమనించి రూ.1.3 లక్షల విలువ చేసే 5.30 మెట్రిక్ టన్నుల కాంపెక్స్ ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, ఎస్ఐ నరేంద్రభూపతి, ఏఓలు వాసుప్రకాష్, చెన్నవీరస్వామి పాల్గొన్నారు.

రైతులు మెలకువలు పాటించాలి: జేడీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ సుధాకర్

అనంతపురంరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు మెలకువలు పాటించాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని ఆకుతోటపల్లిలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భకోశ సమస్యలతో బాధపడుతున్న పశువులకు వైద్య చికిత్సలు చేశారు. రైతులకు లింగ నిర్ధారిత వీర్యం గురించి అవగాహన కల్పించారు. పాడి రైతులకు పశువుల పెంపకం, మెలకువలను తెలియజేశారు. రైతులకు పలు రకాల మందులు, దాణా అందజేశారు. కార్యక్రమంలో డీడీ రమేష్‌రెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి కార్యనిర్వాహక అధికారి వెంకటేష్, పద్మనాభం, ప్రకాష్, శ్రీకాంత్, ఉష, సర్పంచు గురుప్రసాద్, టీడీపీ నాయకులు రాగే మురళి పాల్గొన్నారు.

చెత్త సేకరణను నిర్లక్ష్యం చేయొద్దు : డీఎల్‌పీఓ

అనంతపురంరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయొద్దని డీఎల్‌పీఓ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం చిన్నంపల్లి పంచాయతీలో జరుగుతున్న చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ దివాకర్, సర్పంచ్ శివశంకర్‌తో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ, తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తున్నారా తదితర విషయాలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. స్థానికంగా జరుగుతున్న వర్మీ కంపోస్ట్ తయారీని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చరణ్‌కుమార్ పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరు

శింగనమల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మిడ్ పెన్నార్ దక్షిణ కాలువ చివరి ఆయకట్టు వరకు నీరు సరఫరా చేస్తామని కల్లుమడి కాలువ అధ్యక్షుడు ఓబుళరాజు తెలిపారు. మంగళవారం దక్షిణ కాలువ 16 నుంచి 19 కాలువ తూములను మూసివేశారు. ఈసందర్భంగా ఓబుళరాజు మాట్లాడుతూ.. చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తామని అన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏని పునరుద్ధరించాలి

అనంతపురం క్రైం/వైద్యం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కోర్టులో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలూ) ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేశారు. జిల్లా బార్ అసోసియేషన్ నాయకులు వీరి దీక్షకు మద్దతు తెలిపారు. బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్, జిల్లాప్రధానకార్యదర్శి వెంకటరాముడు, ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ మెంబర్ రామిరెడ్డి దీక్షలను ప్రారంభించారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వీరమాసప్ప, కార్యదర్శి సతీష్, మరికొందరు న్యాయవాదులు దీక్ష చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ప్రముఖులు చంద్రశేఖర్, రసూల్, పుల్లయ్య బాబు, వేణుగోపాల్, రాజారెడ్డి, సూర్యచంద్ర, ప్రకాష్, ఉమాపతి, మహేశ్వరి, నారాయణరెడ్డి, సతీష్‌కుమార్, వీరమాసప్ప, సూర్యచంద్రయాదవ్, వేణు, రాజారెడ్డి, అబ్దుల్ రసూల్, నరసింహులు, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సాకేహరి, రామకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్

అనంతపురం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఫుట్ బాల్ అండర్-14 బాలుర రాష్ట్ర స్థాయి పోటీలకు ఎరా ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థి సహిష్ణు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ వినూత్నరెడ్డి, ఫుట్‌బాల్‌కోచ్ ఓబులపతి అభినందించారు. ఈనెల 15న ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్డీటీ స్టేడియంలో ఫుట్ బాల్ అండర్-14 విభాగం ఎంపిక నిర్వహించారన్నారు. ఇందులో సహిష్ణు ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు.

అధ్వాన వనం

● శిథిలావస్థకు చేరిన ఆట వస్తువులు
● కనిపించని అధికారుల పర్యవేక్షణ



రాజీవ్ చిల్డ్రన్స్ పార్కులో శిథిలావస్థకు చేరిన ఆట వస్తువులు, వ్యాయామ పరికరాలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు ఏర్పాటు చేసిన ఉద్యానవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వం నుంచి వేలాది రూపాయలు వేతనాలు తీసుకుంటున్న సిబ్బంది కనీసం గంటసేపు కూడా పనిచేయలేదు. బెంచీల మీద కూర్చుని కాలక్షేపం చేస్తూ, భోజనం తెచ్చుకుని తిని చెట్ల కింద నిద్రపోతూ... గడిపేస్తున్నారు. నగరంలోనే విశాలంగా రూ.70లక్షల వ్యయంతో 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన హౌసింగ్‌బోర్డు రాజీవ్‌చిల్డ్రన్స్ పార్కును గాలికొదిలేశారు. ఆట పరికరాలు, పిల్లల కోసం ఏర్పాటు చేసిన కార్ల రేసింగ్ సెంటర్‌ను ప్రైవేటు వ్యక్తుల లైక్వాండోకు ఎలాంటి అనుమతి లేకుండా ఇచ్చేశారు. వైసీపీ ప్రభుత్వంలోని అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్వాకంతోనే ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పారు. ప్రభుత్వ స్థలాన్ని ఇలా ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యోగా కేంద్రం పేరుతో పార్కుకు మరో గేటు పెట్టి ప్రహరీలు నిర్మించారు. పార్కులోకి మెయిన్‌గేట్ కాకుండా మరో గేట్ పెట్టడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. పార్కులో గ్రీనరీ నిర్వహణ కోసం కేటాయించిన సిబ్బంది కాలక్షేపం చేస్తున్నారు. ఏఎంసీ అధికారుల పర్యవేక్షణ లేక పార్కు అస్తవ్యస్తంగా మారింది.

పట్టించుకోని ఏఎంసీ అధికారులు

హౌసింగ్‌బోర్డులోని రాజీవ్‌చిల్డ్రన్స్ పార్కు నగరంలోనే పెద్దది. సుమారు ఐదు ఎకరాల్లో నిర్మించిన పార్కులో పచ్చని చెట్లు, మంచి వాకింగ్ ట్రాక్ ఉంది. పచ్చదనం పెంచడం కోసం అనంత నగరపాలక సంస్థ నుంచి ఏడుగురు ఉద్యోగులను కేటాయించారు. ఉదయం 9 గంటలకు వచ్చే ఉద్యోగులు ఫొటోలకు ఫోజులిచ్చి...పనులు చేస్తున్నట్లు ఏఎంసీ గ్రూపులో అప్‌లోడ్ చేసేస్తారు. ముచ్చట్లు చేసుకుంటూ చెట్ల కింద నిద్రపోవడం పరిపాటిగా మారింది. మధ్యాహ్నం భోజనం తిని తిరిగి చెట్ల కింద పడుకోవడం నిత్యకృత్యమయింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆట వస్తువులన్నీ అధ్వాన్నస్థితికి చేరాయి. పిల్లలు ఆడే ఊయల, ఎవరెస్ట్ శిఖరం, జారుడు బండలు ఇలా అన్ని ఆట వస్తువులు శిథిలావస్థకు చేరాయి. మరుగుదొడ్లను నిరుపయోగంగా ఉంచారు.

అభివృద్ధి చేస్తాం

రాజీవ్‌చిల్డ్రన్స్ పార్కును అభివృద్ధి చేస్తాం. ఇక్కడ మరిన్ని మొక్కలు పెంచి, పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తాం. ప్రజల ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని ఏఎంసీ కమిషనర్ సూచనలతో పార్కులో గ్రీనరీని పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. లోపల ప్రహరీ యోగా కోసం నిర్మించారు. త్వరలో మరుగుదొడ్లను కూడా అందుబాటులోకి తీసుకువస్తాం.

-కృష్ణారెడ్డి, హార్టికల్చర్ ఏడీ, నగరపాలక సంస్థ

పారదర్శకంగా స్మార్ట్ రేషన్ కార్డులు

పంపిణీ చేసిన అధికారులు, నాయకులు



అనంతపురం నగరం, రూరల్ మండలంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇది మంచి ప్రభుత్వమని, ప్రజలకు పారదర్శకమైన స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో టీడీపీ నాయకులు ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. నగరంలోని 8,9 డివిజన్లలో టీడీపీ నాయకులు సిమెంట్ పోలన్న, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేశులు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కడియాల కొండన్న, ఇతర నాయకులు ప్రజలకు స్మార్ట్ కార్డులు అందించారు. కార్యక్రమంలో నాయకులు సుంకన్న, కుళ్లాయప్ప, రామాంజి, ఫణీంద్ర, హాజీపీరా పాల్గొన్నారు. 12వ డివిజన్‌లోని పాతూరులో కార్పొరేటర్, టీడీపీ నాయకులు జనబలం బాబా పలువురికి స్మార్ట్ కార్డులు అందించారు. కార్యక్రమంలో కో యూనిట్ ఇన్‌చార్జ్ రాజా, డివిజన్ అధ్యక్షుడు బాల, బూత్ ఇన్‌చార్జ్ కరీముల్లా, అస్లం, ప్రభాకర్, నాగరాజు, బాలాజీ పాల్గొన్నారు. 13వ డివిజన్‌లో ప్రజలకు స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్యచౌదరి, యూనిట్ ఇన్‌చార్జ్ బండి కాశీ, నగర బీసీ సెల్ ప్రధానకార్యదర్శి చిట్రా నాగరాజు, బూత్ ఇన్‌చార్జ్ బండి లక్ష్మన్న, రఘు ఇంటింటికీ తిరిగి కార్డులు అందించారు.

● అనంతపురంరూరల్: మండలంలోని సోములదొడ్డిలో కాపు కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పామురాయి వెంకటేష్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీలర్ వీరనారప్ప, టీడీపీ నాయకులు చల్లా నాయుడు, దాసరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

● శింగనమల: మండలంలోని గుమ్మేపల్లి, నాయనవారిపల్లి, శింగనమల, గోవిందరాయునిపేట గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, నాయకులు చంద్ర, సూరి పక్కీరప్ప, మునేశ్వర్ పాల్గొన్నారు.

● నార్పల: మండలంలో తహసీల్దార్ అరుణకుమారి, టీడీపీ నాయకులు ఆకుల విజయకుమార్ తదితరులు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీలర్లు రామానాయుడు, సుదర్శన్, నాయకులు ప్రతాప్‌చౌదరి, బాలనాగి, నరేష్, సాలేహా, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

అనంతపురంరూరల్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలోని సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ సిబ్బంది మండలంలోని కందుకూరు గ్రామ సమీపంలో నివాసం ఉంటున్న ఎరుకుల వర్గాలకు సామాజిక, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మునినారాయణప్ప మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్టీలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు అమలు చేయడానికి విధి, విధానాలు రూపొందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమం కేంద్ర సిబ్బంది శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, కొండారెడ్డి, పద్మావతి, ప్రశాంత్, నర్మదా, వరలక్ష్మి పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు రావాలి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను రూపొందించాలని జేఎన్‌టీయూఏ అనుబంధ ఓటీపీఆర్ఐ సంచాలకుడు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఓటీపీఆర్ఐలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా అంకుర సంస్థల ఏర్పాటుకు కావాల్సిన సాంకేతిక, నైపుణ్య అంశాల గురించి విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, రీసోర్స్ పర్సన్స్ బాల ఓబులమ్మ, పరమేష్‌నాయక్, సేతు మాధవ్, గణేష్ మణికంఠ, సమీరాబాను, పద్మావతి, హరిచందన్ పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయాలి: సీపీఐ



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా, ఇతర ఎరువులు, ప్రత్యామ్నాయ విత్తనాలను వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలపై వ్యవసాయశాఖ జేడీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ.. ఆర్‌బీకే కేంద్రాలలో అవసరమైన యూరియా ఉందని జేడీ చెబుతున్నా ఎక్కడా నిల్వలు లేవని మండి పడ్డారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, చిన్నప్పయాదవ్,నారాయణస్వామి, రామక్రిష్ణ, నరేష్, కృష్ణుడు, రాము పాల్గొన్నారు.

దివ్యాంగ క్రీడాకారులకు ప్రభుత్వం అండ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని డీఎస్‌డీఓ మంజుల తెలిపారు. మంగళవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎస్‌డీఓ మంజులను కలిసి తమ సమస్యలను విన్నవించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ నాగరాజు, ఎన్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి సహకారం లేదని తెలిపారు. డీఎస్‌డీఓ స్పందిస్తూ దివ్యాంగ క్రీడాకారులకు ప్రోత్సాహకం ఉంటుందని, ఇద్దరు దివ్యాంగ క్రీడాకారులు డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివప్ప, నాగరాజు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

గార్లదిన్నె, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమతుల్యత కాపాడేందుకు మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. మంగళవారం పెనకచెర్ల డ్యాం పారెస్టు పరిధిలోని సుమారు 600 సీతాఫలము, 200 కానుగ, 200నారవేప మొక్కలను ఉపాధి పథకం సిబ్బందితో నాటించారు.

గుడిసెలకు ఆకతాయిల నిప్పు



కాలుతున్న గుడిసెలు

కనగానపల్లి, సెప్టంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దలాపురం సమీపంలో హంద్రీనీవా కాలువ లైనింగ్ పనుల వద్ద కూలీల కోసం ఏర్పాటు చేసిన గుడెసెలకు మంగళవారం రాత్రి గుర్తుతెలియని ఆకతాయిలు నిప్పు పెట్టారు. స్థానికులు తెలిపిన మేరకు.. బద్దలాపురం సమీపంలో హంద్రీనీవా లైనింగ్ పనులు కోసం క్యాంపును ఏర్పాటు చేసి కూలీల కోసం గుడెసెలు ఏర్పాటు చేశారు. ఆకతాయిలు నిప్పు పెట్టడంతో దగ్ధమయ్యాయి. గుడెసెల్లో ఎవరూ లేరు.

ఉమ్రా యాత్రకు 21 మంది పయనం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్రా యాత్రకు 21 మంది ముస్లిం వెళ్లారు. మంగళవారం రెండోరోడ్డు బహవుద్దీన్ మసీదులో ముతవల్లి ఫరీదుద్దీన్, ఇమాం యూసుఫ్‌ఖాన్, తెహరీక్ ఫైజనే ఉమర్ ఫరూక్ అధ్యక్షుడు హసన్ రజా ఖాద్రి ప్రత్యేక ప్రార్థనలు చేయడంతోపాటు ఉమ్రా యాత్రికులను శాలువా, పూలహారాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం ప్రత్యేక వాహనంలో హైదరాబాద్ వెళ్లారు.

కుటుంబ సమస్యను రాజకీయం చేయడం తగదు

ఆత్మకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగే కుటుంబ తగాదాలను వైసీపీ నాయకులు రాజకీయం చేయడం సమంజసం కాదని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు హితవు పలికారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల పరిధిలోని తలుపూరు గ్రామంలో అన్నదమ్ములు చిన్నతగాదాను ఎంపీపీ హేమలత రాజకీయం చేస్తూ టీడీపీ నాయకులు వారిపై దాడులు చేశారని తప్పుడీవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపంపేటలో బీజేపీ జిల్లా కార్యదర్శి రావి చైతన్య కిశోర్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల కు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, నాయకులు వేణుగోపాల్, లక్ష్మీదేవి, రామాంజనేయులు, హరీష్‌రెడ్డి, అజేయ్ యాదవ్ హాజరయ్యారు. అనంతరం పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు దసరా పండుగను పురస్కరించుకుని దుస్తులు పంపిణీ చేశారు.

నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వండి : డీఈ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో ఎలాంటి నాణ్యతాలోపాలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని డీఈ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం సబ్‌డివిజన్-1 డీఈ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. ఎక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టినా నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. నిత్యం క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు చేసిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి కొన్నింటిలో బిల్లులు పెండింగ్ ఉన్నాయి. సమావేశంలో ఏఈలు వెంకటశేషయ్య, పార్థసారధి, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి బాబు, ప్రధాన అర్చకులు రాముస్వామి పాల్గొన్నారు.

గుండెపోటుతోనే రామకృష్ణనాయక్ మృతి : డీఎస్పీ



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

శింగనమల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులగుడ్డంతండాకు చెందిన రామకృష్ణనాయక్ గుండెపోటుతోనే మృతి చెందాడని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మండలంలోని నాగులగుడ్డంతండాలో రామకృష్ణనాయక్ మృతిపై వివాదం చోటు చేసుకుంది. దీనిపై మంగళవారం డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కౌలుట్లయ్య శింగనమలలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 14న రాత్రి నాగులగుడ్డంతండాలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది స్థావరం దాడులు చేశారని తెలిపారు. పేకాడుతున్న రామకృష్ణ నాయక్, మరో నలుగురు నుంచి రూ.7,650 స్వాధీనం చేసుకుని, వారి సెల్‌ఫోన్ తీసుకుని సోమవారం స్టేషన్‌కు రావాలని గ్రామ పెద్దలకు చెప్పి తిరిగి వచ్చారని అన్నారు. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో రామకృష్ణనాయక్ ఛాతిలో నొప్పితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు గార్లదిన్నె ఆసుపత్రికి తరలించారని తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు శింగనమల ఆసుపత్రికి తరలించారని అన్నారు. అక్కడి వైద్యులు చికిత్స చేస్తుండగా గుండెపోటుతో మృతి చెందాడని పేర్కొన్నారు. పోలీసులు హింసించడంతో మృతి చెందాడని అసత్య ప్రచారం చేశారని, పోలీసులు ఎలాంటి హింస పెట్టలేదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు విజయ్‌కుమార్, సాగర్, చితంబరయ్య పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి: ఏపీటీఎఫ్



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

అనంతపురంవిద్య, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే ఉద్యమం చేయాల్సి వస్తుందని ఏపీటీఎఫ్ నేతలు హెచ్చరించారు. వారాంతపు నిరసనలు ముగింపు సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి, మాజీ కార్యదర్శి నరసింహులు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల వెంకటేష్, సిరాజుద్దీన్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి ఏడాదిన్నరయినా ఒక్క హామీ పరిష్కరించకపోవడం దారుణం అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల కూటమి ప్రభుత్వం వ్యతిరేకంగా వ్యవహరించడం బాధాకరం అన్నారు. ఇప్పటికైనా స్పందించి డీఏలు, ఐఆర్ ప్రకటించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేష్‌కుమార్, సుభద్ర, సర్దార్‌వలి, వెంకటరమణ, వన్నప్ప, రామ్మోహన్, గురురాజ్, తిప్పేస్వామి, హనుమంతు, నాగరాజు, శివారెడ్డి, అడవిరాజు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

జేవీవీ రాష్ట్ర కమిటీలో 'అనంత' నేతలకు చోటు



డాక్టర్ ప్రసూన, వీరరాజు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జన విజ్ఞాన వేదిక (జేవీవీ) అనంతపురం జిల్లా నాయకులకు రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. ఈనెల 13, 14 తేదీల్లో విజయనగరంలో జరిగిన మహాసభల్లో భాగంగా అనంతపురం జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎంపిక చేసినట్లు జేవీవీ రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ గేయానంద్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా డాక్టర్ ప్రసూన, వీరరాజును ఎంపిక చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సాకే భాస్కర్, విద్యా విభాగం సబ్ కమిటీ సభ్యులుగా మహమ్మద్, జిలాన్, వైద్య విభాగం సబ్ కమిటీ కోకన్వీనర్‌గా లక్ష్మీనారాయణ, మ్యాజిక్ సబ్‌కమిటీ సభ్యుడుగా ప్రసాద్, సమతా సబ్ కమిటీ సభ్యురాలుగా నాగరత్నకు చోటు దక్కింది.

ప్రైవేట్ స్కూల్ బస్సులను పరిశీలించాలి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్ బస్సులను రవాణాశాఖ అధికారులు పరిశీలించాలని సీపీఎం రాప్తాడు, రూరల్ ప్రాంతీయ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం మన్నీల గ్రామ సమీపంలో క్లచ్‌ప్లేట్ విరిగిపోయి నిలిచిన బస్సును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామం నుంచి ప్రతిరోజు 50మంది పిల్లలు ఆకుతోటపల్లి సమీపంలోని సేతు స్కూల్ వెళుతున్నారన్నారు. పిల్లలను ఎక్కించుకుని వెళుతున్న సమయంలో గ్రామ సమీపంలో క్లచ్‌ప్లేట్ విరిగిపోయి బస్సు నిలిచిపోయిందన్నారు. మరో పది అడుగులు ముందుకొచ్చి ఉంటే బావిలో పడే ప్రమాదం ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పోతులయ్య, పుష్పరాజు, సిద్ధయ్య, రాయమ్మ పాల్గొన్నారు.

రైతులు అందరికీ యూరియా



రైతులకు యూరియా అందజేస్తున్ననాయకులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు అందరికీ యూరియా పంపిణీ చేస్తామని రాచానపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు పాముదాయి రఘు అన్నారు. మంగళవారం మండలంలోని సోములదొడ్డి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో యూరియాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీలర్ నాగలింగారెడ్డి, నాయకులు ఆదినారాయణరెడ్డి, సుబ్బారావు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. మంగళవారం ఎన్జీఓహోంలో ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా సర్వసభ్యసమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు మధుబాబు మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న తరహాలో సంక్షేమపథకాలు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, అబ్రహంలింకన్, అజయ్‌బాబు, తిరుపాలు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ జేడీగా ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీగా డాక్టర్ ప్రేమ్‌చంద్ నియమితులయ్యారు. ఆ శాఖ డైరెక్టరేట్‌లో డీడీగా పనిచేస్తున్న ప్రేమ్‌చంద్‌ను ఉద్యోగోన్నతిపై జిల్లా జేడీగా బదిలీ చేశారు. ఉరవకొండ డీడీ సుధాకర్‌ను ఉద్యోగోన్నతిపై డైరెక్టరేట్‌కు బదిలీ చేశారు. ధర్మవరం డీడీ చంద్రశేఖర్‌ను నెల్లూరు జిల్లాకు నేషనల్ కామధేను బ్రీడింగ్ సెంటర్ జేడీగా బదిలీ చేశారు.

న్యూస్ బాక్స్

22 నుంచి నవరాత్రి ఉత్సవాలు



పందిరికర్ర పూజలో ఉత్సవ సమితి సభ్యులు

తాడిపత్రి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక యల్లనూరురోడ్డులోని వాటర్‌ట్యాంక్ వద్ద ఉన్న శ్రీ విజయచౌడేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 22నుంచి అక్టోబరు 2వరకు నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ సమితి కన్వీనర్ పోతుల గంగాధర్‌యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ దుర్గామాత మట్టి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పందిరికర్ర పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు శివారెడ్డి, నారాయణస్వామి, వేణుగోపాల్, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు



చెక్కును అందిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నేపథ్యంలో మంటపం నిర్వహణకు స్థానిక సర్కిల్ వినాయక కమిటీ సభ్యులు స్థానికుల నుంచి విరాళాలు సేకరించారు. అందులో మిగిలిన రూ.3.30 లక్షలను స్థానిక దశభుజ గణపతి దేవాలయ అభివృద్ధికి అందజేశారు. ఆ నగదును ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు చేతుల మీదుగా ఆ ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు.

● స్మార్ట్ రేషన్ కార్డుల అందజేత : పట్టణంలోని 9వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డులను విప్ పంపిణీ చేశారు. ఆర్డీఓ వసంత బాబు, తహసీల్దార్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.

● విప్‌కు సన్మానం

రాయదుర్గం రూరల్ : ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న 12 మినీ కేంద్రాలనూ మెయిన్ సెంటర్లగా స్థాయి పెంచారు. అందుకు కృషి చేసిన విప్ కాలువ, మండల కన్వీనర్ హనుమంతును సీడీపీఓ పద్మావతి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సంఘం అధ్యక్షురాలు గోవిందమ్మ, కార్యదర్శి మేరి, కోశాధికారి రాధ సన్మానించారు. కార్యక్రమంలో కార్యకర్తలు నాగవేణి, కాంచన, భీమక్క పాల్గొన్నారు.

యూటీఎఫ్ బైక్ ర్యాలీ ప్రారంభం



ర్యాలీని ప్రారంభిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు రణభేరి ప్రచార జాత పేరుతో మంగళవారం బైక్ ర్యాలీ చేపట్టారు. స్థానిక సరోజిని నాయుడు మున్సిపల్ బాలికల పాఠశాల వద్ద ఈ ర్యాలీని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రారంభించారు. అనంతరం పాఠశాల నుంచి హనుమాన్ సర్కిల్ వరకు ఈ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ ఉరవకొండ, కళ్యాణదుర్గం మీదుగా అనంతపురానికి చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు రమణయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు రామప్పచౌదరి, కోశాధికారి రాఘవేంద్ర, నాయకులు కోటేశ్వరప్ప, సంజీవ్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

ఆ ఉపాధ్యాయుడు మాకొద్దు సార్..!



ఎంఈఓలకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు

కుందుర్పి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని పాఠశాలకు ఉపాధ్యాయుడిగా శివశంకర్ ను నియమించరాదని మండలంలోని మహంతపురం గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు వారు మంగళవారం మండల విద్యాశాఖాధికారులు తిప్పేస్వామి, శంకరప్పకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. తమ గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా శివశంకర్ 2021లో విధులు నిర్వహించారని, సక్రమంగా పాఠశాలకు వచ్చేవారు కాదని, విధులను నిర్లక్ష్యం చేసేవారని వాపోయారు. దీంతో విద్యార్థులు చదువులో చాలా వెనకబ్డారన్నారు. నేడు మళ్లీ శివశంకర్ బదిలీపై తమ పాఠశాలకు వస్తున్నారని, ఆయన్ను మరో పాఠశాలకు బదిలీ చేయాలని, ఆ ఉపాధ్యాయుడు వద్దని తేల్చిచెప్పారు.

సమయపాలన పాటించని వైద్యులు

వైద్యం అందక రోగులు విలవిల



వైద్యాధికారితో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బెళుగుప్ప, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. మంగళవారం డాక్టర్లు ఇద్దరు ఉండగా.. పదిన్నర గంటలు దాటినా ఎవరూ విధులకు హాజరుకాలేదు. ఎంపీహెచ్ఈఓ ఫార్మసిస్టు సూపరింటెండెంట్, ల్యాబ్ టెక్నీషియన్ కూడా రాలేదు. దీంతో జ్వరాలతో బాధపడుతున్న అనేక మంది సుమారు గంట సేపు వారికి కోసం నిరీక్షించారు. అనంతరం విధులకు వచ్చిన ఓ వైద్యుడ్ని టీడీపీ నాయకులు నిలదీశారు. అనేక మంది జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని, ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అని నాయకుల రాము, యర్రిస్వామి ప్రశ్నించారు.

కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



రాష్ట్ర చైర్మన్‌తో సుదర్శన్‌నాయుడు

పుట్లూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మంచౌదరిని విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సన్మానించినట్లు మండలానికి చెందిన కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సుదర్శన్‌నాయుడు తెలిపారు. అనంతరం కార్పొరేషన్ డైరెక్టర్లతో నిర్వహించిన సమావేశానికి హాజరై నిరుపేద కమ్మ కులస్థుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, లక్షుమయ్య ఉన్నారు.

విద్యతోనే ప్రగతికి పునాది

పాఠశాల అకడమిక్ డైరెక్టర్ నరసింహాచారి



సూచనలిస్తున్న పాఠశాల అకడమిక్ డైరెక్టర్ నరసింహాచారి

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జీవితాల్లో ప్రగతి చదువుతోనే సాధ్యమని, వారు చదువులో బాగా రాణించేలా తాము కృషి చేస్తున్నామని స్థానిక శ్రీ వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల అకడమిక్ డైరెక్టర్ నరసింహాచారి తెలిపారు. మంగళవారం సాధనిక ఆ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక దశలోనే మంచి విద్యాబుద్ధులు నేర్పించి.. విజయాలు సాధించే దిశగా అడుగులు వేస్తామన్నారు. విద్యార్థుల ఆటపాటల ద్వారా సృజనాత్మక విద్యను అందిస్తూ వారికి శారీరక మానసిక అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు ప్రతిరోజు తెలియచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్వస్త్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ కింద బుధవారం నుంచి మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు నాగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి నవీన్‌కుమార్ తెలిపారు. 17వ తేదీన నాగసముద్రం, అయ్యవారిపల్లి, 18న నెలగొండ, వెంకటాంపల్లి, 19న కసాపురం, దోసులుడికి, 20న తిమ్మాపురం, నక్కనదొడ్డి, 22న మొలకలపెంట, ఓబుళాపురం, 24న పాతకొత్తచెరువు, దంచెర్ల, 26న వైటీచెరువు, 29న దోనిముక్కల గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తారు.

● గుత్తి : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు మహిళలు, కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి ఎల్లప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వీరికి కేన్సర్, మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధులను గుర్తించేందుకు ముందస్తుగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు, కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐలో మిగిలిన సీట్ల భర్తీకి నాల్గో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుంతకల్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బద్రీనాథ్ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని... ఒరిజినల్ సర్టిఫికెట్లను దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని అన్నారు. ఈనెల 27లోపు దరఖాస్తు చేసుకోవాలని, 29న కౌన్సెలింగ్ ఉంటుందని అన్నారు.

తాడిపత్రి క్రికెటర్ ప్రతిభ



మహేంద్రరెడ్డి

తాడిపత్రి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కడపలో మంగళవారం జరిగిన ఏసీఏ అండర్-23 మల్టీ డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లో తాడిపత్రికి చెందిన క్రీడాకారుడు మహేంద్రరెడ్డి 235పరుగులు సాధించాడు. డబుల్ సెంచరీ సాధించిన మహేంద్రరెడ్డిని కోచ్ సాధిక్‌వలి, భార్గవ్ అభినందించారు.

గడేకల్లులో కొనసాగిన వైద్య శిబిరం

విడపనకల్లు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారులు, మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు గడేకల్లు గ్రామంలో ఐదు రోజుల పాటు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఉరవకొండ ఏరియా మలేరియా యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి మంగళవారం తెలిపారు. కాగా, గడేకల్లులో పరిస్థితిపై మంత్రి ఎప్పటికి అప్పుడు టీడీపీ నాయకుల ద్వారా ఆరా తీస్తున్నారు.

గ్రామదేవతకు భక్తిశ్రద్ధలతో బోనాలు



కరిగానపల్లిలో బోనాలతో మహిళల ఊరేగింపు

కుందుర్పి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిగానపల్లిలో గ్రామదేవతకు మంగళవారం ఘనంగా బోనాలు సమర్పించారు. ఇటీవలే గ్రామంలో గ్రామదేవతను ప్రతిష్ఠించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువతులు, మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

● కణేకల్లు : మండలంలోని గోపులాపురం గ్రామంలో దేవమ్మ, పోలేరమ్మల ఊరుదేవరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయమే అమ్మవారికి ఆకు పూజ నిర్వహించి.. సాయంత్రం బోనాలు సమర్పించారు. 15 ఏళ్ల తర్వాత నిర్వహిసున్న ఈ ఊరుదేవరతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ముగిసిన భాగవత సప్తాహం



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

యల్లనూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగంపల్లిలో బుధవారం నుంచి నిర్వహిస్తున్న భాగవత సప్తాహం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాత్మికవేత్త, రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి పాల్గొన్నారు. పురాణ ఇతిహాసాలైన రామాయణం, మహాభారతం, మహాభాగవతం భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు సూచికలు అన్నారు. కార్యక్రమంలో రాయలసీమ భాగవత భక్త సమాజ మీడియా ఇన్‌చార్జ్ యాగంటి బాలకృష్ణారెడ్డి, భాగవతులు రామకంచిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, సర్పంచు కుళ్లాయప్పనాయుడు, నరేంద్రనాయుడు, అర్చకులు పవన్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

సూక్ష్మ పోషకాలతో అధిక దిగుబడి

విడపనకల్లు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కంది పైరుకు సూక్ష్మ పోషకాలైన జింక్, ఐరన్, మెగ్నిషియం, సల్ఫర్ తదితర వాటిని అందిస్తే మంచి దిగుబడి వస్తుంది అని ఏఓ హెచ్ పెన్నయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని గడేకల్లు, ఎన్ తిమ్మాపురం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కంది పైరులో లోపాలు నివారించాలంటే 20 కేజీల జింక్ సల్ఫేట్, 10 కేజీల సల్ఫర్, నాలుగు కిలోల బోరాక్స్, సాళ్ల మధ్యలో వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కైలాష్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆముదానికి తెగుళ్లు

ఉరవకొండ,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆముదం పంటకు నల్లి తామర తెగులు సోకుతోందని, దాని నివారణకు ఇమిడా క్లో ప్రేడ్‌తో పిచికారి చేయాలని వ్యవసాయాధికారి రామకృష్ణ తెలిపారు. మండలంలోని రాకెట్లలో మంగళవారం నిర్వహించిన.. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆముదం పంటపైన దాసరి పురుగులు, పిండి నల్లి పురుగులు కనిపిస్తున్నాయని, దాసరిపురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోమేట్‌ను 100గ్రాములకు 150లీటర్ల నీటిని, పిండి నల్లి పురుగులు నివారణకు ఇమిడా క్లో ప్రేడ్ 100 మిల్లీగ్రాములకు 150 లీటర్ల నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు.

చేపల చెరువు వేలం

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళం గ్రామ పంచాయతీలోని చెరువులో చేపలు వదిలి పెంచి అమ్ముకునేందుకు హక్కు కల్పించేందుకు వేలంపాట కార్యక్రమాన్ని మంగళవానం నిర్వహించినట్లు ఈఓపీఆర్డీ మురకళికృష్ణ పేర్కొన్నారు. ఈ వేలంపాటలో 12 మంది పాల్గొన్నారని, గుమ్మఘట్ట మండలం రంగచేడు గ్రామానికి చెందిన సురేష్ రూ.4.25 లక్షలకు వేలంపాట పాడి.. సొంతం చేసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు పేర్కొన్నారు. గత ఏడాది రూ.2.11 లక్షలు కాగా.. ఈసారి రూ.2.31 లక్షలు అధికంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వచ్చిన సొమ్మును జనరల్ ఫండ్ ఖాతాకు జమ చేస్తున్నట్లు తెలిపారు.

అందుబాటులో ఉండని వైద్యులు

పుట్లూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సరిగా ఉండడం లేదని, సమయానికి విధులకు రావడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు వాపోయారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు మాట్లాడారు. అనేక మంది జ్వరాలతో బాధపడుతున్నారని, వైద్యులు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ రాఘవరెడ్డి, వైద్యురాలు శ్రీవాణి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బైక్‌లు, అదుపులో ఉన్న నిందితుడు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల దొంగను అరెస్ట్ చేశామని, అతని నుంచి నాలుగు బజాజ్ పల్సర్ 125 సీసీ ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. నిందితుడ్ని కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం లంజబండ గ్రామానికి చెందిన పింజరి షేక్షావలిగా గుర్తించామన్నారు. అతనిపై కసాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, కర్నూల్ త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైందన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని సంగాల గ్రామ సమీపంలో అతన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు.

బోరుబావుల కేబుల్ చోరీ



కట్ చేసిన కేబుల్

యాడికి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో రైతు పరిమి చరణ్‌కు చెందిన నాలుగు బోరుబావుల కేబుల్‌ను దుండగులు చోరీ చేశారు. మొత్తం 200 మీటర్ల కేబుల్ ఉందని, దీనివిలువ రూ.40వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయారు. ఇటీవల కేబుల్ దొంగతనాలు ఎక్కువయ్యాయని, ఈ ఏడాదిలోనే తనతోటలో ఇలా చోరీ జరగడం ఎనిమిదో సారని తెలిపాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోతుండడంతో.. ఇక ఫిర్యాదు చేయడమే మానేశామని అన్నారు. చోరీ సమాచారం అందుకున్న పోలీసులు బోరుబావుల వద్దకు వెళ్లి పరిశీలించారు.

నలుగురిపై కేసు

యాడికి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): నగరూరులో ఇంటి వద్ద గొడవపడిన సంఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. నగరూరు గ్రామానికి చెందిన మనోహర్ వర్గీయులు, శ్రీరంగ వర్గీయులు ఇంటి వద్ద గొడవపడ్డారు. మనోహర్ ఫిర్యాదు మేరకు శ్రీరంగ, నారాయణస్వామి, వెంకటనారాయణ, రామాంజనేయులుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై దాడి

తాడిపత్రి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దివాకరరెడ్డి పెట్రోల్‌బంక్ సమీపంలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుడు కృష్ణయ్యపై మంగళవారం రాత్రి ముగ్గురు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారు. సీపీఐ కాలనీ సమీపంలో ఎస్టీపీ-1కు సంబంధించి పైప్‌లైన్ గుంతలు తవ్వి.. తిరిగి వెళుతున్న సమయంలో తమ మడికయ్యల్లో గుంత తవ్వుతావా అని ముగ్గురు వ్యక్తులు అతనిపై దాడి చేసి.. వెళ్లిపోయారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శెట్టూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాల చదువుతున్న సుప్రియ, ఎస్ స్వాతి, ఎస్ అమూల్య జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 12, 13న తూర్పుగోదావరి జిల్లా మండపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సుప్రియ టెన్నీకాయిట్ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికైంది. అక్టోబరులో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుంది. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 15వ తేదీన ఆర్డీటీ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలలో ఎస్ స్వాతి, ఎస్ అమూల్య పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ జీ శ్రీరాములు, పీఈటీ జబీసలాం, ఉపాధ్యాయులు అభినందించారు.

19న వాహనాల వేలం

కణేకల్లు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కణేకల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలను శుక్రవారం వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఉమాబాయి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో జరిగే ఈ వేలంపాటలో రూ. వెయ్యి డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన

రాయదుర్గం రూరల్,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కొండన్న ఆధ్వర్యంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు అధ్యక్షతన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సర్పంచులకు, ఎంపీపీలకు రీసోర్స్‌పర్సన్స్ బాలగంగిరెడ్డి, దివాకరరెడ్డి అవగాహన కల్పించారు.

రిజర్వాయర్‌కు 2,417 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు 2,417 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 2,377 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు మంగళవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్ 1.710 టీఎంసీలు నీరు ఉందన్నారు.

క్రీడామైదానం చదును



మైదానాన్ని చదును చేస్తున్న దృశ్యం

ఉరవకొండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని చాబాల గ్రామంలో క్రీడా మైదానాన్ని టీడీపీ నాయకులు మంగళవారం శుభ్రం చేయించారు. క్రీడా మైదానమంతా పిచ్చి మొక్కలతో నిండి పోవడంతో విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు ఇబ్బందులు పడేవారు. దీంతో స్థానిక టీడీపీ నాయకులు ట్రాక్టర్‌తో ఆ మైదానంలోని పిచ్చి మొక్కలను తొలగించి.. చదును చేయించారు. ఈ కార్యక్రమంలో చాబాల ఈశ్వర్, కేదార్‌నాథ్, శ్రీనివాసులు, రామాంజి, అంజి పాల్గొన్నారు.

● శ్మశాన వాటికలో..

విజయదశమిని నేపథ్యంలో హిందువులు వారి పెద్దల సమాధుల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. స్థానిక శ్మశాన వాటికలో ముళ్లపొదలు పెరిగిపోవడంతో వాటిని టీడీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో తొలగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్యారం కేశవానంద, వార్డు సభ్యులు రామాంజినేయులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

నీటి ఊట ముప్పుపై ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బెళుగుప్ప, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని నాగుల చెరువు నిండటంతో వ్యాపార సముదాయాలు, ఇంటి సెల్లార్లలో నీరు ఊరుతోంది. ఈ ఊట నీటితో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో.. ఏ ఇల్లు కూలుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి మంగళవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన తహసీల్దార్ అనిల్ కుమార్, ఆర్ఐ నగేష్, వీఆర్వో శ్రావణి ఎస్సీ కాలనీలోని ఆ ఇళ్లను పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదికలు పంపి సమస్య పరిష్కరిస్తామన్నారు.

విద్యుత్ కార్మికుల నిరసన

తాడిపత్రి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని విద్యుత్ శాఖలోని రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికులు స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో రమణ, మంజు, పావురాల శీనా, వెంకటరామిరెడ్డి, పెంచలయ్య, ప్రభాకర్, మూర్తి పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో పలువురి చేరిక

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాల్టీ కార్మికులు 20 మంది సీఐటీయూ నుంచి ఏఐటీసీలోకి మంగళవారం చేరినట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ తెలిపారు. మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి నాయక్, ఏఐటీయూసీ నియోజకవర్గ నాయకులు బుడేన్, రామాంజనేయులు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ అందజేత

పెద్దవడుగూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం చెన్నమ్మతల్లి రైతుమిత్ర సంఘానికి వ్యవసాయాధికారి మునికృష్ణ సబ్సిడీతో మంజూరైన డ్రోన్ యాంత్రిక పనిముట్లను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ దివాకర్‌రెడ్డి, గంగరాజుయాదవ్, నాగేశ్వర్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.